RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 23 ఫిబ్రవరి 2026 సోమవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:223

## ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### ఏదులాపురం మున్సిపల్ పాలకవర్గం సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి



**ఖమ్మం(ప్రజాబలం ప్రతినిధి:** ఖమ్మం : ఫిబ్రవరి -22:ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గం, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరంమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ× ఏదులాపురం మున్సిపాలిటీ కి నూతనంగా చైర్ పర్సన్ గా ఎంపికైన అనిత, వైస్ చైర్మన్ నవీన్, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లకు అభినందనలు తెలిపారు. ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిందని, ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికల తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై మాత్రమే దృష్టి సారించాలని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ చాలా విశాలంగా ఉంటుందని, ఇక్కడ ఓపెన్ ప్లేస్ చాలా ఉన్నదని, అనేక మౌలిక వసతుల కల్పన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా ఏదులాపురంను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి కౌన్సిలర్ రోజు ఉదయం వార్డు పరిధిలో పర్యటిస్తూ జరిగే పారిశుద్ధ్య పనులను, అభివృద్ధి పనులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ప్రతి పని డబ్బుతోనే జరగదని మన పని తీరు ఆధారంగా అనేక మంచి కార్యక్రమాలు అమలు చేయవచ్చని తెలిపారు. వారానికి కనీసం ఐదు రోజులు రెండు గంటల పాటు వార్డులో సమయం గడపాలని అన్నారు. 15 రోజులలో మరొక సమావేశం నిర్వహించి విడతల వారీగా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలి అనే అంశంపై సమావేశం నిర్వహిస్తామని అన్నారు.మున్సిపాలిటీలో క్షేత్రస్థాయి పర్యటనలు ఓపెన్ ప్లాట్లలో నీరు నిలవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడడం గమనించామని, నాలాల ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజా జీవితంలో మనకు వచ్చిన అవకాశాన్ని పేదలకు మంచి చేసేందుకు వినియోగించాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాధ బాబు, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ మునవర్ అలీ, మునిసిపల్ కౌన్సిలర్లు, వివిధ

## మాజీమంత్రి హరీష్ రావుకు కౌంటర్ ఇచ్చిన ఎంపీ చామల కిరణ్ రెడ్డి



మధు పార్క్ రిడ్జ్ అపార్ట్ మెంట్ వాసులను హరీష్ రావు తప్పుదోవ పట్టించారుప్రభుత్వాన్ని నిందించాలని హరీష్ రావు చూస్తున్నారుగాంధీ సరోవర్ కట్టాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదుమధు పార్క్ రిడ్జ్ బిల్డర్లు 2012 లో ఉన్న జీఓ ప్రకారం 30 మీటర్స్ బఫర్ ఉండాలిగత ప్రభుత్వం కమీషన్లకు కకక్కుర్తి పడి హైదరాబాద్ నగరంలో ఇష్టానుసారంగా పర్మిషన్లు ఇచ్చారుగత ప్రభుత్వం కమీషన్లు దండుకోవడం కోసం చేసిన పనికి అపార్ట్ మెంట్ వాసులు ఇబ్బందులు పడుతున్నారుప్రభుత్వం అపార్ట్ మెంట్ వాసులకు నష్ట పరిహారం ఇస్తుంది.బిల్డర్లపై కచ్చితంగా కేసులు పెడతాము.వారి చేత అపార్ట్ మెంట్ వాసులకు నష్ట పరిహారం ప్రభుత్వం ఇప్పిస్తుంది30 మీటర్లు బఫర్ ఉండాల్సిన చోట 9 మీటర్లు బఫర్ చూయించి నాళా మీద మధు పార్క్ రిడ్జ్ బిల్డర్లు పర్మిషన్ తీసుకున్నారుహరీష్ రావు ప్రభుత్వంపై రోజు తప్పుడు ప్రచారం చేస్తున్నారుహైదరాబాద్ నగర అభివృద్ధి, మూసీ పునరుజ్జీవం కావాలని రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారుమెట్రో ఫెజ్ 2,మూసీ ప్రక్షాళన,ట్రిపుల్ ఆర్,ఫ్యూచర్ సిటీ నిర్మాణం లక్ష్యంగా రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారుడీపీఆర్ ఎప్పుడు ఇస్తారో హరీష్ రావుకు తెలియదాసబర్మతి,గంగా నదుల పునరుజ్జీవం కోసం అక్కడ ఉన్న ఆక్రమణలను తొలగించారుగత ప్రభుత్వాలు చేసిన తప్పుల వలన ప్రజలు తెలియక అపార్ట్ మెంట్స్ కొనుక్కున్నారుఇందులో ప్రజల తప్పు లేదుగత ప్రభుత్వం అవినీతి ఉందని హరీష్ రావు తెలుసుకోవాలిబిఆర్ఎస్ హయాంలో నాళాల మీద పర్మిషన్లు ఇచ్చారుసీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దాలని అనుకుంటున్నారుప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ ప్రతి పనికి అడ్డుపడుతుందికాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయవద్దని బిఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకుందిలోక్ సభ,అసెంబ్లీ ఉప ఎన్నికలు మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పార్టీపై ప్రజల అభిమానం పెరిగిందని బిఆర్ఎస్ కు అర్థం అయిందిహరీష్ రావు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని ఆపలేరుహైదరాబాద్ నగర అభివృద్ధి అనేది కాంగ్రెస్ ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి అజెండాహరీష్ రావు,బిఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారుకాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో ఉంటుంది× నిర్వాసితులకు నష్ట పరిహారం ఇస్తాముబిల్డర్లు,అధికారులపై చర్యలు తీసుకుంటాము2012 కు ముందు ఉన్న రికార్డులు కావలంటే హరీష్ రావుకు ఇస్తానుహరీష్ రావు చిల్లర రాజకీయాలు మానుకోవాలి

## ఏఐ సదస్సులో ఆ రెండు అవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయి: 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

**ఏఐ సదస్సు ద్వారా అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామన్న మోదీ**

**జంతువుల చికిత్సకు, పురాతన గ్రంథాల సంరక్షణ కోసం ఏఐ వినియోగం చూసి ఆశ్చర్యపోయారన్న మోదీ**

**సైబర్ నేరాల పట్ల హెచ్చరిక జారీ చేసిన నరేంద్ర మోదీ**

**10 నెలల చిన్నారి అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులకు ప్రశంసలు**




న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల ముగిసిన 'ఏఐ ఇంపాక్ట్' సదస్సుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. దీని ద్వారా కృత్రిమ మేధ రంగంలో భారతదేశ అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామని అన్నారు. ఆదివారం 131వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రపంచ దేశాలను ఆకర్షించిందని అన్నారు.

ఈ సదస్సులో ముఖ్యంగా మన రెండు ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని తెలిపారు. జంతువుల చికిత్సకు వాటిని ట్రాక్ చేయడానికి 'ఏఐ'ని ఉపయోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని అన్నారు. నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్ రంగాలకు చెందిన వారు ఈ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు.

కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధన, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన యువత ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని అన్నారు. ఈ సదస్సు ద్వారా మన యువత ప్రతిభను ప్రపంచానికి చూపించగలిగామని అన్నారు.

సైబర్ నేరాలపై హెచ్చరిక

సైబర్ నేరాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

కాగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను ప్రధాని మోదీ ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. వారి నిర్ణయం నలుగురికి జీవనదాతగా మారిందని పేర్కొన్నారు.

## గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతాం రేవంత్ రెడ్డి





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** గోదావరి నదీ జలాల వినియోగం, దానిపై తలెత్తిన వివాదాలు, ప్రాజెక్టుల నిర్మాణం వంటి అన్ని అంశాలపై శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో సమగ్రంగా ఒకరోజు చర్చిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతామని, ఆ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అక్కరలేదని పునరుద్ఘాటించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం జె చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇంజనీర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , ధనసరి అనసూయ సీతక్కపొంగులేటి శ్రీనివాస రెడ్డి , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి రితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి దేవాదుల ఇంటేక్ పాయింట్ వద్ద మోటార్లను పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు స్థితిగతులపై ముఖ్యమంత్రి గారు సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "తెలంగాణ నీటి హక్కుల విషయంలో శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం. ఒక ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముందుకు వెళుతున్నాం. అవసరమైన నిధులను సమీకరిస్తున్నాం.ఎంతటి జటిలమైన సమస్య అయినా చర్చల ద్వారా పరిష్కారమవుతుందని బలంగా విశ్వసిస్తా. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతూ శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి. మాకు ఎలాంటి బేషజాలు లేవు. అధికారుల స్థాయిలో, రెండు రాష్ట్రాల ప్రతినిధులతో చర్చల్లో తేలకపోతే కేంద్ర ప్రభుత్వం వద్ద, లేదా రివర్ మేనేజ్మెంట్ బోర్డుల వద్ద, ట్రిబ్యునళ్ల ముందు లేదా సుప్రీంకోర్టు వరకు ఏదైనా దశల వారిగా వెళ్లాలి. తెలంగాణ నీటి హక్కులను కాపాడే విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అక్కరలేదు. నీటి హక్కుల విషయంలో అనవసరమైన గందరగోళానికి గురిచేయొద్దు. సహేతుకమైన విమర్శలు చేయాలి. నికర జలాలు, మిగులు జలాలు, వరద జలాలపై హక్కులను కాపాడుకుంటాం. గోదావరి నదిపై ప్రాజెక్టులను పూర్తి చేసుకుని ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసుకోవాలి. అనవసరమైన వివాదాలు, గందరగోళపరిచే విమర్శల వల్ల ప్రయోజనం లేదు. సమైక్య పాలనలో తెలంగాణ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. తెలంగాణ ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ విధానపరమైన లోపాలు, ఆలోచనల కారణంగానో ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గడిచిన పదేళ్లలో చిత్తశుద్ధితో ప్రాజెక్టులను పూర్తి చేసి 967 టీఎంసీల నీటిని వినియోగంలోకి తెచ్చుకుని ఉంటే, వరద జలాలపైనా, వాటా నీటిని తరలించడానికి అవకాశం ఉండే. 2001 లో మొదలైన దేవాదుల రెండు దశాబ్దాలు దాటినా ఇంకా సాగుతూనే ఉంది. ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పుడు నిధుల సమస్య వచ్చింది. రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉండటం వల్ల అవసరమైన నిధులు విడుదల చేయాలంటే కొరత ఉంది. అందుకే సమీక్షించి వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇప్పటికే అంచనాలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు. ఈ విధానానికి ముగింపు పలకాలి. సవరించిన అంచనాలను సవరించి మంత్రివర్గం ఆమోదంతో పనులను వెంటనే పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. తుమ్మడిహెట్టి నుంచి భద్రాచలం వరకు ఉన్న అన్ని ప్రాజెక్టులపైన పూర్తిస్థాయి సమీక్ష చేసి వాటిని పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తాం. కాళేశ్వరం నుంచి చుక్కనీటిని ఎత్తిపోయకుండానే తెలంగాణలో అత్యధిక దిగుబడి సాధించాం. గోదావరి, కృష్ణా జలాలపై పక్క రాష్ట్రానికి తరలించడానికి సహకరిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆరోపణలు సరికాదు. గోదావరి నదీ జలాలపై శాసనసభలో చర్చ చేద్దాం. సూచనలు ఇవ్వండి. చవకబారు ఆరోపణలతో ప్రయోజనం లేదు. తెలంగాణ గౌరవాన్ని దెబ్బతీయొద్దు. ప్రతిపక్షం ఇచ్చే మంచి సూచనలను స్వీకరిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు తెలంగాణ ప్రజల ఆస్తి. గాలికి వదిలేయం. ప్రజలకు ఉపయోగపడేలా చేస్తాం. బ్యారేజీలకు సంబంధించి ఆనకట్టలకు సంబంధించి భూమి లోపల ఎమైనా సమస్యలున్నాయా అన్న కోణంలో కూడా విశ్లేషణలు జరగాలి. ఆ ప్రాజెక్టు భవిష్యత్తులో ప్రమాదకరంగా మారకూడదన్న ఆలోచనతో ఉన్నాం. ఆ తర్వాత ఆ బ్యారేజీలను పునరుద్ధరిస్తాం.." అని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతర బ్రహ్మాండంగా సాగిందని అన్నారు. దక్షిణ కుంభమేళా తరహాలో జాతర జరిగిందని పేర్కొంటూ, మేడారం అభివృద్ధికి సంబంధించి భక్తులు నిరంతరం సందర్శించేలా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల తర్వాత మరోసారి మేడారం సందర్శించి సమీక్షిస్తానని చెప్పారు.

ప్రజాబలం

23 ఫిబ్రవరి 2026 సోమవారం

# యాంత్రికమైన జ్ఞానార్జన!

ఇవ్వాళ కాలేజీలు, విశ్వవిద్యాలయాలు మనసున్న మనిషిని తయారు చేసే నిలయాలుగా లేవు. అవి ఉద్యోగాలకు టికెట్లు ఇచ్చే కౌంటర్లుగా మారాయి. మార్కులు, ర్యాంకులు గ్రేడ్లు ప్యాక్ చేసి విడుదల చేసే ఉత్పత్తి కేంద్రాలయ్యాయి. ఇక్కడ విద్యార్థి ఆలోచించే ప్రాణి కాదు, కేవలం ఒక ఫైల్. ఒక హాల్ టికెట్ నెంబర్. ఒక రిజల్ట్. అతని కళ్లలో ప్రశ్నలు ఉంటాయి, కానీ వాటి చెంతే స్టాప్ సిగ్నల్ కూడా ఉంటుంది. తరగతి గది ఇప్పుడు ప్రశ్నలకు చోటివ్వదు. అది టైమ్ టేబుల్‌కు విధేయంగా ఉంటుంది. ఎంత సిలబస్ చెప్పామన్నది ముఖ్యం, ఎవరికి ఏమి అర్థమైందన్నది కాదు. సంస్కృతి ఈ క్యాంపస్‌లలో అప్పుడప్పుడూ అతిథిలా ప్రవేశిస్తుంది. ఏటా ఒక రోజు? ఒక స్టేజ్, ఒక సెల్ఫీ; మరుసటి రోజు ఒక న్యూస్ క్లిప్, మళ్లీ మౌనం.

కవితలు సిలబస్ అంచుల్లో పడుకుంటాయి. సినిమాలు 'డిస్ట్రాక్షన్'గా ముద్ర వేయబడతాయి. భాషలు పరీక్ష పేపర్ వరకే పరిమితమవుతాయి. విద్య వేగంగా పరిగెడుతోంది... లోతు మాత్రం వెనుకబడుతోంది. సర్టిఫికెట్లు పెరుగుతున్నాయి... స్పృహ మాత్రం తగ్గుతోంది. విద్య మనిషిని కాదు సి.విని తయారు చేస్తోంది. ఆలోచనను కాదు ఫలితాన్ని కొలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే కాలేజీలు, విశ్వవిద్యాలయాలు భవిష్యత్తును రూపొందించే ప్రదేశాలుగా కాక, పరీక్షలు నిర్వహించే శిక్షణ కేంద్రాలుగా మిగిలిపోతాయి. నిజానికి కాలేజీలు విశ్వవిద్యాలయాలు కేవలం తరగతుల గదులు, కారిడార్లు, పరీక్షా హాళ్ల సమాహారం కాదు. అవి భావాలు శ్వాస తీసుకునే ప్రదేశాలు, ఆలోచనలు స్వేచ్ఛగా నడిచే స్థలాలు. ప్రశ్నలు, జవాబులు పక్కపక్కనే కూర్చునే స్థలాలు. నవయువ మనసులు నెమ్మదిగా, మనిషిగా మారడాన్ని నేర్చుకునే వాతావరణం అది. సాంస్కృతిక వాతావరణమే ఆయా క్యాంపస్‌లకు కనిపించని హృదయ స్పందన. అది లేకపోతే జ్ఞానం యాంత్రికమవుతుంది,

డిగ్రీలు కేవలం ప్రాణం లేని కాగితాలవుతాయి, విద్య అనుభూతిని మరిచిపోతుంది. సాయంత్రం వేళ ఒక కవిత గొంతెత్తి చదివినప్పుడు, మసక వెలుగుల్లో ఒక నాటకం సాధన చేస్తున్నప్పుడు, హాస్టల్ గదిలో పుట్టిన పాట, రాత్రి గాలిలో కలిసిపోయినప్పుడు అక్కడే విద్య నిశ్శబ్దంగా తన సంపూర్ణతను పరిపూర్ణతను పొందుతుంది. ఎందుకంటే అక్కడే విద్యార్థులు ఏమి ఆలోచించాలో కాదు, దేన్ని ఎలా చూడాలో నేర్చుకుంటారు. ఇతర భాషలను, చరిత్రలను, ఇతరుల బాధలు, ఆనందాలను; ప్రాంతం, కులం, మతం, లింగం పేరుతో అడ్డుగా నిలిచిన గోడలను కరిగించి, పంచుకున్న క్షణాలను సృష్టిస్తుంది. సాంస్కృతిక వాతావరణం విశ్వవిద్యాలయాలకు ఒక అంతఃకరణను ఇస్తుంది. సాంస్కృతికత ఉన్న విశ్వవిద్యాలయం ఆలోచించే పౌరులను, సున్నితమైన మనసులను, అన్యాయాన్ని సాధారణంగా అంగీకరించని హృదయాలను సమాజానికి అందిస్తుంది. అటువంటి క్యాంపస్ తన గేట్ల వద్ద ముగియదు. అది సమాజంలోకి ప్రవహిస్తుంది. ప్రశ్నలుగా, కళగా, ప్రతిఘటనగా, ఆశగా... కాలేజీ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో సంస్కృతిని నిర్మించే అనేక దారులున్నాయి.

ఆలోచనకు స్వేచ్ఛ, భిన్నతకు గౌరవం, సృజనాత్మకతకు చోటు అనే విలువలు.. గోడలపై రాసే నినాదాలుగా కాదు, దైనందిన కార్యక్రమంగా మారాలి. క్యాంపస్‌లో కొన్ని ప్రదేశాలు ఎప్పుడూ తెరిచి ఉండాలి. ఆడిటోరియం తాళం వేసిన గది కాకుండా, సాయంత్రం ఆలోచనలు చేరే మైదానంగా మారాలి. గ్రంథాలయం కేవలం పరీక్షల కోసం, మార్కుల కోసం చదివే వేదికగా కాకుండా, మనసు నిశ్శబ్దం కావడానికి ఉపయోగపడే ప్రదేశంగా ఉండాలి. భయపడే చోట సంస్కృతి ఎప్పుడూ పుట్టదు. విద్యార్థులు కేవలం వినియోగదారులు కాదు, వారే సంస్కృతి సృష్టికర్తలు. సిలబస్ కూడా సంస్కృతితో మాట్లాడాలి; శాస్త్రం కవితను వినాలి; సాహిత్యం సమాజాన్ని ప్రశ్నించాలి; సినిమా తత్వశాస్త్రంతో వాదించాలి. తరగతి గది? జీవితం నుంచి విడిపోయిన దీవిలా ఉండకూడదు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పే యంత్రాలు కాదు. వారు సంస్కృతికి దీపస్తంభాలు. ఒక కవితను సూచించడం, ఒక సినిమా చూడమని చెప్పడం, ఒక ప్రశ్నను ఆపకుండా ముందుకు నెట్టడం ఇలాంటివే పెద్ద సాంస్కృతిక చర్యలు. ఉపాధ్యాయుడికి గౌరవం ఉండాలి. భాషలు క్యాంపస్‌లో వినిపించాలి. మాతృభాషలు, ప్రాంతీయ స్వరాలు, జానపద గీతాలు? అన్నీ కలిసి మాట్లాడినప్పుడు సంస్కృతి విస్తరిస్తుంది. ఒకే స్వరం సంస్కృతి కాదు. సాంస్కృతిక వేదికలు అందరికీ చెందాలి.

సంస్కృతి పరిపక్వత నేర్పే క్యాంపస్‌లకు డబ్బు అవసరమే. గదులు అవసరమే. పుస్తకాలు, వేదికలూ అవసరమే. కానీ అంతకంటే ముఖ్యమైనది సంకల్పం. దాన్ని ఎప్పుడో ఒకసారి కాదు నిరంతరం ప్రతిరోజూ నెరవేర్చాలి. బయట ప్రపంచంతో క్యాంపస్‌లు మాట్లాడాలి. రచయితలు రావాలి, కళాకారులను పిలవాలి. సమాజం కాంపస్‌లోకి రావాలి. సంస్కృతి ఒంటరిగా బతకలేదు. సంస్కృతిని సంఖ్యలతో కొలవలేం. దాని ఫలితం ప్రశ్నల్లో కనిపిస్తుంది; ప్రశాంత మనసుల్లో మెరుస్తుంది; సమాజంలోకి వెళ్లిన విద్యార్థుల్లో, వాళ్ళ జీవితాల్లో నెమ్మదిగా బయటపడుతుంది. అప్పుడే కాలేజీ, విశ్వవిద్యాలయ క్యాంపస్ ఒక సంస్థగా కాదు... ఒక సజీవ విద్యా సంస్కృతిగా మారుతుంది. మనసున్న సమాజాన్ని సృష్టించే వేదిక అవుతుంది.

# జూబ్లీహిల్స్‌లో బీభత్సం సృష్టించిన స్పోర్ట్స్ కారు

**జూబ్లీహిల్స్‌లో అదుపుతప్పిన ఫెరారీ స్పోర్ట్స్ కారు**
**అతివేగంతో ఇతర వాహనాలను ఢీకొట్టి బీభత్సం**
**ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు**
**రోడ్ నెం. 45లో భారీగా నిలిచిన ట్రాఫిక్**
**ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలన్న పోలీసుల సూచన**




హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆదివారం ఓ ఫెరారీ స్పోర్ట్స్ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో ప్రయాణిస్తున్న ఈ కారు రోడ్ నెం. 45లో అదుపుతప్పి పక్క రోడ్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో పలు కార్లు, బైక్‌లను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటన సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నివాసానికి సమీపంలో చోటుచేసుకుంది. ప్రమాదం ధాటికి వాహనాలు నుజ్జునుజ్జవగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పడిపోవడంతో రోడ్ నెం. 45లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. రోడ్ నెం. 45 నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు, అలాగే కేబుల్ బ్రిడ్జి నుంచి రోడ్ నెం. 45 వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. వాహనదారులు ఈ మార్గాలను తప్పించి ప్రత్యామ్నాయ రూట్లలో ప్రయాణించాలని పోలీసులు సూచించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తారకరత్న బతికుంటే ఇవాళ 43వ పుట్టినరోజు జరుపుకునేవాడు: విజయసాయిరెడ్డి

**దివంగత నటుడు నందమూరి తారకరత్న 43వ జయంతి నేడు**
**ఈ సందర్భంగా ఆయన్ను స్మరించుకున్న విజయసాయిరెడ్డి**
**భౌతికంగా లేకపోయినా జ్ఞాపకాలు మాతోనే ఉంటాయంటూ భావోద్వేగ పోస్ట్**




దివంగత నటుడు నందమూరి తారకరత్న 43వ జయంతి సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి అతడిని స్మరించుకుంటూ భావోద్వేగ నివాళి అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ఉన్న వారి బంధుత్వాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన ఈ ట్రిబ్యూట్ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

"ఈ రోజు మన మధ్య ఉండుంటే తారకరత్న 43వ పుట్టినరోజు జరుపుకునేవాడు. విధి అతడిని త్వరగా దూరం చేసినా, అతడి జ్ఞాపకాలు, చిరునవ్వు, ఆత్మీయత మన హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయి. మా కళ్ల ముందు లేకపోయినా, మా ఆలోచనల నుంచి ఎప్పటికీ దూరం కాడు. అతడి జయంతి సందర్భంగా తీవ్ర భావోద్వేగంతో, గౌరవంతో స్మరించుకుంటున్నాను" అని విజయసాయిరెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు.

విజయసాయిరెడ్డికి, నందమూరి తారకరత్న కుటుంబానికి మధ్య బంధుత్వం ఉన్న విషయం తెలిసిందే. తారకరత్న భార్య అలేఖ్యారెడ్డికి విజయసాయిరెడ్డి పెదనాన్న అవుతారు.

2023లో తారకరత్న గుండెపోటుతో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ కన్నుమూయడం తెలిసిందే.

# బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల... చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు

**చంద్రబాబు, జగన్‌లు బీజేపీకి బానిసలుగా మారారని షర్మిల విమర్శ**
**మోదీ చైనా రోబోను ప్రదర్శించినప్పుడు వీరి నోళ్లు పెగల్లేదని ఎద్దేవా**
**చంద్రబాబుది అధికారిక పొత్తు కాగా, జగన్‌ది బీజేపీతో అక్రమ పొత్తు అని ఆరోపణ**
**రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అంటూ కొత్త నిర్వచనం**
**రైతుల కోసం కాంగ్రెస్ నిరసన చేస్తుంటే ఉగ్రకోణం అంటారా అని ఫైర్**




ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు.

ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు.

ప్రజల్లో కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతుండటం చూసి ఓర్వలేకే బీజేపీ తమ నిరసనకు ఉగ్రవాద కోణాన్ని అంటగడుతోందని, ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. మోదీ కాషాయ కామెర్లు సోకిన వారు ఇలా కాకుండా ఎలా మాట్లాడతారని ఆమె వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# మళ్లీ ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్

**అస్వస్థతకు గురి కావడంతో రూబీ హాల్ క్లినిక్ ఆసుపత్రిలో చేరిక**
**తన తండ్రి దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారన్న కుమార్తె సుప్రియా సూలే**
**వారం రోజుల క్రితమే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన శరద్ పవార్**




నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ ఆదివారం మళ్లీ ఆసుపత్రిలో చేరారు. అస్వస్థతకు గురికావడంతో పూణేలోని రూబీ హాల్ క్లినిక్ ఆసుపత్రిలో చేరారు. తన తండ్రి దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారని ఆయన కుమార్తె, బారామతి ఎంపీ సుప్రియా సూలే తెలిపారు. అనారోగ్యం కారణంగా చికిత్స పొంది ఆయన వారం రోజుల క్రితమే ఇంటికి తిరిగి వచ్చారు. శరద్ పవార్ డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. శరద్ పవార్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలియాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

# జగిత్యాల జిల్లాలో అనుమానాస్పద స్థితిలో కాలువలో శవమై తేలిన బీజేపీ నాయకుడు

### జిల్లాలోని పెగడపల్లి మండలం సుద్దపల్లిలో విషాదం
### ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయిన రమణారెడ్డి
### ప్రమాదమా లేక హత్యనా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు




జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లిలో బీజేపీ నాయకుడు రమణారెడ్డి అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయారు. గతంలో ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా పని చేశారు. మూడు రోజుల క్రితం ఆయనకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది.

రమణారెడ్డి ప్రయాణిస్తున్న బ్రెజ్జా కారు ఎస్సారెస్పీ కాలువలో పడటంతో ఆయన మృతి చెందాడు. ఆయన ఇటీవల క్రిప్టో కరెన్సీతో భారీగా నష్టపోయాడు. మూడు రోజులుగా ఆయన కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆయన కారును ఎస్సారెస్పీ కాలువలో గుర్తించి వెలికి తీయగా అందులో రమణారెడ్డి మృతదేహాన్ని ఉంది. ప్రమాదవశాత్తు కారు అందులో పడిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆయన 18వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారని, దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా ఈ ప్రాంతాన్ని దాటి అతను బయటకు వెళ్లినట్లుగా ఎక్కడా లేదన్నారు. దీంతో ఇదే ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా ఈరోజు ఉదయం కాలువలో పడినట్లు గుర్తించామని అన్నారు. కారును వెలికితీయగా రమణ మృతదేహం లభ్యమైందన్నారు.

# బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అరెస్టు... కిషన్ రెడ్డి ఆగ్రహం

### బాన్సువాడ, కామారెడ్డిలకు వెళ్లేందుకు ప్రయత్నించిన రామచందర్ రావు
### ఉదయం నుంచి హౌస్ అరెస్టు, ఆ తర్వాత అరెస్టు చేసిన పోలీసులు
### రామచందర్ రావు అరెస్టును ఖండించిన కిషన్ రెడ్డి
### కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం

తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావును పోలీసులు అరెస్టు చేశారు. కామారెడ్డి, బాన్సువాడలకు వెళ్లేందుకు ఆయన ప్రయత్నించడంతో తార్నాకలోని ఆయన నివాసం వద్ద పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. రామచందర్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. రామచందర్ రావును అరెస్టు చేసిన సమయంలో పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.




కామారెడ్డి జిల్లా బాన్సువాడలో రెండు వర్గాల మధ్య ఇటీవల ఘర్షణ జరిగిన నేపథ్యంలో అక్కడకు వెళ్లేందుకు రామచందర్ రావు సిద్ధమయ్యారు. అదే సమయంలో కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ వారు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ అక్కడకు కూడా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఉదయం నుంచి రామచందర్ రావును గృహ నిర్బంధం చేసిన పోలీసులు, ఆ తర్వాత అరెస్టు చేశారు.

రామచందర్ రావు అరెస్టును ఖండించిన కిషన్ రెడ్డి

రామచందర్ రావు అరెస్టును కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. బాన్సువాడ, కామారెడ్డిలకు ఆయన వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమని అన్నారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగిందని, ఇది ఆందోళనకరమని ఆయన అన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డిలో గెలిచినందుకు కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు పాల్పడటం సరికాదని అన్నారు.

# దేశంలోనే వేగవంతమైన మెట్రో... మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

### గంటకు 120 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనున్న మెట్రో
### నమో భారత్ రైలు సేవలను కూడా ప్రారంభించిన ప్రధాని మోదీ
### పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఢిల్లీ-మీరట్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్




దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా నమో భారత్ రైలు సేవలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ-మీరట్ మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్) కారిడార్‌పైనే మీరట్ మెట్రో కూడా నడవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. దేశంలో ఒకే మౌలిక వసతులపై రెండు వేర్వేరు రైలు సేవలు నడవడం ఇదే తొలిసారి. నమో భారత్ రైలు సాధారణంగా గంటకు 160 కి.మీ., గరిష్ఠంగా 180 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా రూ.12,390 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. 82 కిలోమీటర్ల ఢిల్లీ-మీరట్ నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. దీంతో ఢిల్లీ, మీరట్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

# ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు... పదవీ విరమణ వరకూ వేటు!

### ఐపీఎస్ సునీల్ కుమార్‌పై కొనసాగనున్న సస్పెన్షన్ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
### రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ప్రధాన ఆరోపణలు
### సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వాదన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారి, సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటును మరోసారి పొడిగించింది. ఆయనపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణ ముగిసే వరకు లేదా ఆయన పదవీ విరమణ చేసే తేదీ వరకు (ఏది ముందైతే అది) సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

1993 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునీల్ కుమార్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ అడిషనల్ డీజీగా, ఆ తర్వాత సీఐడీ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో, అప్పటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలపై గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై క్రిమినల్ కేసు (క్రైమ్ నెం. 187/2024) నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు ఏసీబీ కోర్టులో విచారణ దశలో ఉంది.





ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో సునీల్ కుమార్‌ను తిరిగి సర్వీసులోకి తీసుకుంటే సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని, దర్యాప్తు పారదర్శకంగా సాగేందుకు సస్పెన్షన్ పొడిగింపు తప్పనిసరి అని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటితో పాటు, ప్రభుత్వ అనుమతి లేకుండా 2020 నుంచి 2024 మధ్య పలుమార్లు విదేశాలకు వెళ్లడం, అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలపై కూడా ఆయన ఏసీబీ విచారణను ఎదుర్కొంటున్నారు.

ఆల్ ఇండియా సర్వీసెస్ (డిసిప్లిన్ ఒ అప్పీల్) రూల్స్, 1969లోని రూల్ 3(3) ప్రకారం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సునీల్ కుమార్ పదవీ విరమణ తేదీ 2026 జూన్ 30 కావడంతో, అప్పటివరకు కేసుల విచారణ పూర్తికాకపోతే ఆయన సర్వీసులో చేరకుండానే రిటైర్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు: విజయ్ ఎక్కడ్నించి పోటీ చేయాలో చెబుతున్న కార్యకర్తలు

### 2026 ఎన్నికల్లో పెరంబూరు నుంచి పోటీ చేయాలంటూ విజయ్‌కు విజ్ఞప్తి
### చెన్నైలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించిన టీవీకే కార్యకర్తలు
### డీఎంకేకు చెన్నై కోట కాదంటూ సవాల్ విసిరిన పార్టీ నేతలు
### ఉత్తర చెన్నైపై దృష్టి సారించిన తమిళగ వెట్రి కళగం

తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం తమ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా, పార్టీ అధ్యక్షుడు విజయ్ పెరంబూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. ఉత్తర చెన్నైని రాబోయే రాజకీయ పోరుకు కేంద్రంగా మార్చాలన్న పార్టీ ఉద్దేశం దీని ద్వారా స్పష్టమవుతోంది.




ఆదివారం చెన్నైలో జరిగిన పార్టీ సమావేశంలో టీవీకే ఎన్నికల ప్రచార నిర్వహణ కార్యదర్శి ఆదవ్ అర్జున ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పెరంబూరు నుంచి విజయ్ పోటీ చేయాలన్నది కార్యకర్తలందరి ఏకగ్రీవ అభిప్రాయమని ఆయన తెలిపారు. ఈ తీర్మానానికి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ మద్దతు తెలిపారు. కార్యకర్తల మనోభావాలను గౌరవిస్తామని, వారి ఆకాంక్షను దళపతి విజయ్‌కు తెలియజేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ డిమాండ్ వెనుక ఉన్న కారణాన్ని వివరిస్తూ ఆదవ్ అర్జున కీలక వ్యాఖ్యలు చేశారు. పేదరికం ఎక్కువగా, ప్రజల అవసరాలు అధికంగా ఉన్న నియోజకవర్గాల నుంచే పోటీ చేయాలన్నది తమ పార్టీ సిద్ధాంతమని, ఉత్తర చెన్నైలోని పరిస్థితులు దీనికి సరిగ్గా సరిపోతాయని అన్నారు. పెరంబూరు, కొళత్తూరు, లేదా ఆర్.కె. నగర్ వంటి ఉత్తర చెన్నై నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకే విజయ్ కూడా మొగ్గు చూపుతున్నారని ఆయన వెల్లడించారు.

ఇదే సమయంలో, అధికార డీఎంకేపై ఆదవ్ అర్జున విమర్శలు గుప్పించారు. చెన్నై డీఎంకేకు కంచుకోట అన్న వాదనను ఆయన తోసిపుచ్చారు. "ఇకపై చెన్నై టీవీకేదే" అని ప్రకటించి, ఆ అభిప్రాయాన్ని మార్చడానికే తాము రాజధాని నుంచి ప్రచారం ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో డీఎంకే ఆధిపత్యం ఉందని చెబుతున్నా, స్థానిక బలమైన నేతలు ఇప్పుడు టీవీకే వైపు చూస్తున్నారని మంత్రి పి.కె. శేఖర్ బాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ పరిణామంతో, 2026 ఎన్నికల్లో చెన్నై కేంద్రంగా టీవీకే దూకుడుగా ప్రచారం చేయనుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

# కుక్క నాకడంతో ఇన్ఫెక్షన్... కాళ్లు, చేతులు కోల్పోయిన మహిళ!

**బ్రిటన్‌లో కుక్క నాలుక తగలడంతో మహిళకు తీవ్ర అస్వస్థత**

**శరీరంలోని చిన్న గాయం ద్వారా రక్తంలోకి చేరిన ప్రమాదకర బ్యాక్టీరియా**

**సెప్సిస్ కారణంగా రెండు చేతులు, రెండు కాళ్లు తొలగించిన వైద్యులు**

**కుక్కల లాలాజలంలోని 'క్యాప్‌నోసైటోఫాగా' బ్యాక్టీరియాతోనే ముప్పు**

**సుమారు 32 వారాల పాటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరిన మహిళ**

బ్రిటన్‌లో నివసిస్తున్న భారత సంతతి మహిళ జీవితంలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న కుక్క. మహిళ గాయాన్ని నాకడంతో ఆమె సెప్సిస్ బారిన పడి, రెండు చేతులు, రెండు కాళ్లు కోల్పోవాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన పెంపుడు జంతువుల యజమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

వివరాల్లోకి వెళితే, యూకేలోని వుల్వర్‌హాంప్టన్‌కు చెందిన మంజిత్ సంఘా (52) అనే మహిళ గత ఏడాది జూలైలో అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చిన ఆమెకు అనారోగ్యంగా అనిపించగా, మరుసటి రోజు ఉదయానికి స్పృహ కోల్పోయారు. ఆమె చేతులు,




కాళ్లు చల్లగా మారడం, పెదవులు నీలంగా మారడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఆమె భర్త కమల్‌జిత్ సంఘా బీబీసీకి వివరిస్తూ, "ఒక్క రోజులో అంతా మారిపోయింది. శనివారం కుక్కతో ఆడుకుంది, ఆదివారం పనికి వెళ్లింది, సోమవారానికి కోమాలోకి వెళ్లిపోయింది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

న్యూ క్రాస్ ఆసుపత్రిలోని ఐసీయూలో చేర్చిన వైద్యులు, ఆమె సెప్సిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. కుక్కల లాలాజలంలో సహజంగా ఉండే 'క్యాప్‌నోసైటోఫాగా కానిమోర్సస్' అనే బ్యాక్టీరియా, ఆమె శరీరంలోని చిన్న గాయం ద్వారా రక్తంలోకి ప్రవేశించిందని గుర్తించారు. ఈ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఆమెకు ఆరుసార్లు గుండెపోటు వచ్చింది. ప్రాణాలు కాపాడే క్రమంలో వైద్యులు ఆమె రెండు కాళ్లు (మోకాళ్ల కింద), రెండు చేతులు తొలగించారు. ఆమె ప్లీహాన్ని కూడా తీసేయాల్సి వచ్చింది.

సుమారు 32 వారాల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన మంజిత్, ఇటీవల ఇంటికి తిరిగి వచ్చారు. పెంపుడు జంతువులతో ఆడుకునేటప్పుడు, వాటి లాలాజలం గాయాలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

# పెళ్లికి కొన్ని గంటల ముందే ఇద్దరు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

**రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లాలో విషాదం**

**బలవంతపు పెళ్లి ఇష్టం లేకే ఈ అఘాయిత్యం అని బంధువుల ఆరోపణ**

**రహస్యంగా అంత్యక్రియలకు యత్నం.. పోలీసుల జోక్యం**

**పురుగుల మందు తాగినట్లు ప్రాథమిక నిర్ధారణ**

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లా మనాయ్ గ్రామంలో గుండెను పిండేసే విషాదం చోటుచేసుకుంది. ఒకే పందిరిలో పెళ్లి పీటలు ఎక్కి కొత్త జీవితాన్ని ప్రారంభించాల్సిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు, పెళ్లికి కొద్ది గంటల ముందే ప్రాణాలు తీసుకోవడం స్థానికంగా పెను కలకలం రేపింది. వధువులైన శోభ (25), విమ్ల (23) ఇద్దరూ ప్రైవేట్ స్కూల్ టీచర్లుగా పనిచేస్తున్నారు.




శనివారం వీరిద్దరికీ వివాహం జరగాల్సి ఉంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు ఇంట్లో పెళ్లి వేడుకలు, సంప్రదాయ 'బంధోలి' వేడుకలు సందడిగా సాగాయి. అయితే, శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో వీరిద్దరి ఆరోగ్య పరిస్థితి విషమించింది. కుటుంబ సభ్యులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే వారు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాలను ఇంటికి తెచ్చి, పోలీసులకు చెప్పకుండానే అంత్యక్రియలకు ఏర్పాట్లు మొదలుపెట్టారు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న బాధితుల మేనమామ జస్వంత్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. "మరో ఐదు నిమిషాలు ఆలస్యమైతే పోలీసులు వచ్చేలోపే అంత్యక్రియలు పూర్తి చేసేవారు" అని ఆయన పేర్కొన్నారు. మృతదేహాలు నీలి రంగులోకి మారాయని, ఇది విష ప్రయోగం వల్ల జరిగిన ఆత్మహత్యేనని ఆయన ఆరోపించారు.

బాధితుల తండ్రి సోదరులు (బాబాయిలు) ఈ పెళ్లి విషయంలో తీవ్ర ఒత్తిడి తెచ్చారని జస్వంత్ సింగ్ ఆరోపిస్తున్నారు. మొదట కుదిరిన పెళ్లి సంబంధాలను రద్దు చేసి, బాబాయిల ఒత్తిడి మేరకు పోఖ్రాన్ ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పెళ్లి నిశ్చయించారని, ఈ బలవంతపు పెళ్లి ఇష్టం లేకనే సోదరీమణులు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రాథమిక దర్యాప్తులో పురుగుల మందు తాగినట్లు ఆధారాలు లభించాయి. అయితే, ఘటనా స్థలంలో ఎటువంటి ఆత్మహత్య లేఖ లభించలేదని, కుటుంబ సభ్యులందరినీ విచారిస్తున్నామని ఏడీసీపీ రోషన్ మీనా తెలిపారు.

# యూపీలో దారుణం.. ఒకే కుటుంబంలో ఐదుగురి అనుమానాస్పద మృతి

**భార్యాపిల్లలను చంపి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల అనుమానం**

**రెండు రోజుల తర్వాత దుర్వాసనతో వెలుగులోకి వచ్చిన ఘటన**

**ఆర్థిక ఇబ్బందులా, కుటుంబ కలహాలా అనే కోణంలో దర్యాప్తు**

ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్ జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించడం స్థానికంగా పెను కలకలం రేపింది. భర్తే తన భార్య, ముగ్గురు పిల్లలను కిరాతకంగా హతమార్చి, ఆ తర్వాత తాను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

అమన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెట్రోల్ పంపు దగ్గర సత్యదేవ్ ఫౌజీ అనే వ్యక్తి వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ అక్కడే నివసిస్తున్నాడు. గత రెండు రోజులుగా అతని ఇంటి తలుపులు మూసే ఉన్నాయి. శనివారం ఉదయం ఆ ఇంటి నుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో, చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగలగొట్టి లోపలికి చూడగా, ఒకే గదిలో ఐదు మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో కనిపించాయి.




మృతదేహాల పరిస్థితిని బట్టి చూస్తే, ఈ ఘోరం జరిగి కనీసం రెండు రోజులు అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతులను సత్యదేవ్, అతని భార్య, ముగ్గురు పిల్లలుగా గుర్తించారు. ఫోరెన్సిక్ బృందం సంఘటనా స్థలం నుంచి కీలక ఆధారాలు సేకరించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

అసలు ఈ దారుణానికి దారితీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆర్థిక సమస్యలా లేక కుటుంబ కలహాలేమైనా ఉన్నాయా అనే కోణంలో విచారిస్తున్నారు. ఈ ఘటనపై లోతైన విచారణ కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సత్యదేవ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు.

# హైవేపై మృత్యుఘోష.. ఐదుగురు పోలీసులను బలిగొన్న ప్రమాదం

**ఒడిశా ఝార్సుగూడలో ఘోర రోడ్డు ప్రమాదం**

**పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టిన భారీ ట్రైలర్**

**మరో ముగ్గురికి తీవ్ర గాయాలు**

ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఝార్సుగూడ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఓ భారీ ట్రైలర్, పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టడంతో ఐదుగురు సిబ్బంది అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఝార్సుగూడ జిల్లా సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి-49పై తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విధులు ముగించుకుని బొలెరో వాహనంలో తిరిగి వస్తున్న పోలీసు సిబ్బందిని, ఎదురుగా అతివేగంగా వస్తున్న ట్రైలర్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో పోలీసు వాహనం పూర్తిగా నుజ్జునుజ్జయింది.




ఈ ప్రమాదంలో డ్రిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ కుజుర్, ఏపీఆర్ సిబ్బంది కాశీరామ్ భోయ్, దేవదత్త సా, హవల్దార్ లింగరాజ్ ధురువా, హోమ్ గార్డ్ భక్తబంధు మిర్ధా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురిని ఝార్సుగూడ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

ప్రమాదానికి కారణమైన ట్రైలర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతివేగం లేదా డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి ప్రాథమిక కారణమని భావిస్తున్నారు. ఈ ఘటనపై ఒడిశా ముఖ్యమంత్రి తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున పరిహారం ప్రకటించే అవకాశం ఉంది.

# ఆధార్ కార్డు కాదు.. ఇకపై ఇది ఉంటేనే మహిళలకు ఫ్రీ బస్సు..!

హైదరాబాద్, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళల కోసం ఆర్టీసీ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అర్హులకే ప్రయోజనం అందేలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ కార్డులు జారీ చేయాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు, ఇతర రాష్ట్రాల మహిళల వినియోగాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి నగరంలో విశేష స్పందన లభిస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో సుమారు 3,200 బస్సులు నడుస్తుండగా, అందులో దాదాపు 2 వేల ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. రోజుకు సుమారు 5 లక్షల మంది ప్రయాణికుల్లో దాదాపు 2 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఆక్యుపెన్సీ రేషియో కూడా 90 శాతానికి చేరింది.అయితే, ఇటీవల ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. సుమారు 25 నుంచి 30 వేల వరకు అనుమానాస్పద ప్రయాణాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరుగుతున్న నేపథ్యంలో స్మార్ట్ కార్డు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. స్మార్ట్ కార్డులను చిప్ ఆధారిత టెక్నాలజీతో రూపొందించనున్నారు. కార్డులో లబ్ధిదారుల పేరు, చిరునామా, ప్రత్యేక ఐడీ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతం ఆధార్ కార్డు చూపిస్తే టికెట్ జారీ చేస్తున్న కండక్టర్లు, కొత్త విధానంలో స్మార్ట్ కార్డును టికెట్ ఇష్యూయింగ్ మెషీన్‌తో స్వైప్ చేస్తారు. వెంటనే టికెట్ జనరేట్ అవుతుంది. దీంతో ప్రయాణ ధృవీకరణ మరింత పారదర్శకంగా ఉంటుంది. ఆధార్ కార్డులను ప్రతిసారి వెంట తీసుకెళ్లాల్సిన ఇబ్బంది తగ్గడంతో పాటు, అర్హులైన మహిళలకు సౌకర్యవంతమైన విధానం అమల్లోకి రానుంది. స్మార్ట్ కార్డు జారీ విధానం, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఈ చర్యలు కీలకంగా మారనున్నాయి.

# తమిళనాడు ప్రజలు బీజేపీకి సరైన సమాధానం చెబుతారు: ఉదయనిధి స్టాలిన్

**మోదీ, అమిత్ షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన ఉదయనిధి**

**ఎన్నికల్లో బీజేపీ ముఖానికి ప్రజలు నలుపు పూస్తారని వ్యాఖ్య**

**స్వార్థ రాజకీయాల కోసం బీజేపీకి అన్నాడీఎంకే అమ్ముడుపోయింది**

**మోదీ టీవీలో కనిపిస్తే ప్రజలు భయపడుతున్నారని ఎద్దేవా**

**ఈడీకి, మోదీకి తాము భయపడేది లేదని స్పష్టం**




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై తమిళనాడు ఉప ముఖ్యమంత్రి, డీఎంకే యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి తమిళనాడు ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కోయంబత్తూరు జిల్లా కనియూర్‌లో డీఎంకే యువజన విభాగం పశ్చిమ మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన, బీజేపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఎన్నికల్లో బీజేపీ ముఖానికి తమిళ ప్రజలు నలుపు రంగు పూసి, తగిన రాజకీయ సమాధానం ఇస్తారు" అని ఆయన వ్యాఖ్యానించడంతో పార్టీ కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తూ, ఆయన టీవీలో కనిపిస్తే చాలు ప్రజల్లో ఆందోళన మొదలవుతోందని ఉదయనిధి ఎద్దేవా చేశారు. గతంలో ఆకస్మికంగా ప్రకటించిన కరోనా లాక్‌డౌన్, పెద్ద నోట్ల రద్దు వంటి నిర్ణయాలు దేశవ్యాప్తంగా ప్రజల్లో భయాందోళనలు, తీవ్ర కష్టనష్టాలు సృష్టించాయని గుర్తుచేశారు. "ప్రజలకు ఇచ్చేది డీఎంకే ప్రభుత్వం అయితే, ప్రజల నుంచి డబ్బులు లాక్కునేది బీజేపీ ప్రభుత్వం" అని ఆయన ఆరోపించారు. ఇటీవల కారైకాల్‌లో పర్యటించిన అమిత్ షాను ఉద్దేశించి, "మీరు ఎన్ని రంగులు పూసుకున్నా, ఎన్నికల్లో తమిళ ప్రజలు మీ ముఖానికి నలుపు పూయడం ఖాయం" అని అన్నారు.

కేంద్ర దర్యాప్తు సంస్థలకు, ప్రధాని మోదీకి తాము భయపడబోమని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. "మేం ఈడీకి భయపడం, మోదీకి భయపడం. ఎన్నికలను సాకుగా చూపి అభివృద్ధి పథకాలను అడ్డుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది" అని విమర్శించారు.

స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆ పార్టీ స్వాతంత్ర్యాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. "కొందరు మా ఉద్యమాన్ని నాశనం చేయాలని పగటి కలలు కంటున్నారు. కానీ డీఎంకేను ఎప్పటికీ ఎవరూ కూల్చలేరు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశానికి పాలన, రాజకీయాల్లో తన తండ్రి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మార్గదర్శకంగా నిలుస్తున్నారని, ఆయన నాయకత్వంలో బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పోరాటం చేయాలని పలు రాష్ట్రాల నేతలు ఆకాంక్షిస్తున్నారని ఉదయనిధి తెలిపారు.

రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలపై కూడా ఉదయనిధి విమర్శలు గుప్పించారు. తమిళనాడులో ఎన్ని పోలింగ్ బూత్‌లు ఉన్నాయో కూడా తెలియకుండా కొందరు సర్వేలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు.


# యూత్ కాంగ్రెస్ షర్ట్ లెస్ నిరసనపై తీవ్రస్థాయిలో స్పందించిన ప్రధాని మోదీ

**ఏఐ సదస్సులో కాంగ్రెస్ నగ్న రాజకీయాలు చేసిందన్న ప్రధాని**

**కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతికంగా దివాలా తీసిందని విమర్శ**

**విదేశీ అతిథుల ముందు దేశం పరువు తీశారని ఫైర్**

**కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమి భాగస్వాములకు మోదీ ధన్యవాదాలు**



ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో జరిగిన 'ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోనే అత్యంత పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ సైద్ధాంతికంగా దివాలా తీసిందని ఈ ఘటన స్పష్టం చేస్తోందని ఆదివారం మీరట్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో విమర్శించారు.

కొద్ది రోజుల క్రితం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై యూత్ కాంగ్రెస్ సభ్యులు ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ ఘటనపై మోదీ స్పందిస్తూ, "భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రజలు కష్టపడుతుంటే, దేశ ప్రగతిని కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ సదస్సును భారత్ నిర్వహించడం ప్రతి ఒక్కరికీ గర్వకారణం. కానీ కాంగ్రెస్ ఈ ప్రపంచ వేదికను తమ నీచ, నగ్న రాజకీయాలకు వాడుకుంది" అని అన్నారు.

"విదేశీ అతిథుల ముందు కాంగ్రెస్ నేతలు నగ్నంగా నిలబడ్డారు. అసలు మీ నగ్నత్వం దేశానికి ఇప్పటికే తెలుసు, మళ్లీ కొత్తగా బట్టలు విప్పాల్సిన అవసరం ఏముంది?" అని ప్రధాని ప్రశ్నించారు. సొంత దేశం పరువు తీయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు తన సమాధి తవ్వాలని చూడటం, తన తల్లిని దూషించడం వంటివి చేస్తున్నారని, అయితే దేశ ప్రతిష్ఠకు సంబంధించిన కార్యక్రమంలో ఇలా ప్రవర్తించడం హద్దులు మీరడమేనని అన్నారు.

దేశం పరువు తీసిన వారిని విమర్శించాల్సింది పోయి, కాంగ్రెస్ అగ్రనేతలు ఆ నిరసనకారులను ప్రశంసించడం దురదృష్టకరమని మోదీ వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఘటనపై కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# టెక్నాలజీ పెరిగినా మీ 'హ్యూమన్ టచ్'కు సాటిలేదు: గ్రామీణ డాక్ సేవక్‌లపై సీఎం చంద్రబాబు ప్రశంసలు

**గ్రామీణ డాక్ సేవకుల సేవలు అమూల్యం అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటన**

**కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని సమర్థతపై ప్రశంసలు**

**ఏపీలోని 17,000 మంది డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి**

**రాష్ట్ర ప్రభుత్వ సేవలను కూడా డాక్ సేవకుల ద్వారా అందిస్తామని హామీ**

**వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో పోస్టల్ ఉద్యోగులదే కీలక పాత్ర అని వెల్లడి**




టెక్నాలజీ ఎంత అభివృద్ధి సాధించినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి అందుబాటులోకి వచ్చినా, గ్రామీణ ప్రాంతాల్లో మానవతా స్పర్శతో సేవలు అందించే గ్రామీణ డాక్ సేవకులకు ప్రత్యామ్నాయం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వారి పాత్ర అత్యంత కీలకమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం నాడు గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్‌లతో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, పాత రోజులను గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, ఇతర సమాచారం కోసం ప్రతి ఒక్కరూ పోస్ట్‌మ్యాన్‌పైనే ఆధారపడేవారని, బ్యాంకులు లేని రోజుల్లో ఆర్థిక లావాదేవీలకు కూడా ఇండియా పోస్టే కీలక మాధ్యమంగా ఉండేదని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా సమరయోధుల మధ్య సమాచారాన్ని చేరవేసి పరోక్షంగా కీలక పాత్ర పోషించినవారిసేవలుచిరస్మరణీయమని కొనియాడారు.

**కేంద్ర మంత్రులపై ప్రశంసల వర్షం**

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన ఉన్నత విద్యావంతుడని, రాజవంశంలో పుట్టినా అత్యంత పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు. సింధియా నాయనమ్మ, గ్వాలియర్ రాజమాత విజయరాజే సింధియాతో తనకు మంచి అనుబంధం ఉందని, ఆమె ఎన్టీ రామారావుగారికి అత్యంత సన్నిహితురాలని గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా, సింధియా తండ్రి మాధవరావు సింధియాతో కూడా కలిసి పనిచేశానని, ఆయన నిరాడంబరత, నిజాయతీ గొప్పవని అన్నారు. సింధియా పూర్వీకుల గ్రామమైన 'సింధియా' విశాఖపట్నం గాజువాక సమీపంలో ఉండటం ఆనందంగా ఉందని, వారి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న ఈ అనుబంధం గొప్పదని పేర్కొన్నారు. మరో కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసానిని ప్రశంసిస్తూ, ఒక వైద్యుడిగా, ఐటీ నిపుణుడిగా అమెరికాలో అపారమైన సంపద సృష్టించి, ఇప్పుడు పార్లమెంటులో అత్యంత సంపన్న ఎంపీగా ప్రజాసేవకు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. వీరిద్దరి వంటి సమర్థవంతమైన నాయకులు కేంద్రంలో ఉండటం దేశానికి గర్వకారణమని చంద్రబాబు అభివర్ణించారు.

**డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లు.. ఏపీని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టండి**

భవిష్యత్తులో గ్రామీణ డాక్ సేవకుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు నొక్కిచెప్పారు. వారి పనిభారాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచేందుకు వీలుగా రాష్ట్రంలోని 17,000 మంది గ్రామీణ డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిళ్లను అందించాలని కేంద్ర మంత్రి సింధియాను కోరారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఒక 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్'గా పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల కాలుష్యరహిత ప్రయాణంతో పాటు, శ్రమ తగ్గి గ్రామీణ ప్రాంతాల్లో మరింత వేగంగా సేవలు అందించగలరని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవలను కూడా గ్రామీణ డాక్ సేవకుల ద్వారా ప్రజలకు చేరవేస్తామని, ఇందుకు అవసరమైన సమన్వయం చేసుకుంటామని హామీ ఇచ్చారు.

**డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు**

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటంతో అభివృద్ధి సూపర్ స్పీడ్‌తో ముందుకు సాగుతోందని చంద్రబాబు తెలిపారు. 20 నెలల సుపరిపాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికామని అన్నారు. ఒకప్పుడు స్మశానం, ఎడారి అన్న అమరావతిని దేవతల రాజధానిగా, ప్రపంచం మెచ్చే ప్రజా రాజధానిగా తీర్చిదిద్దుతామని పునరుద్ఘాటించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడి, లాభాల బాట పట్టించామని, ఈ నెలలోనే రూ.54 కోట్ల లాభం వచ్చిందని వెల్లడించారు.

2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని, ఈ 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో గ్రామీణ డాక్ సేవకులే వెన్నెముకగా నిలుస్తారని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉందని సూచించారు.

# లివ్-ఇన్ రిలేషన్‌లో ఘోరం: యువతి ప్రైవేట్ భాగాలపై శానిటైజర్ పోసి నిప్పుపెట్టిన ప్రియుడు!

**పెళ్లి ప్రస్తావన తెచ్చిన యువతిపై ప్రియుడి దాడి**

**శానిటైజర్ పోసి నిప్పంటించి చిత్రహింసలు**

**మూడు రోజుల తర్వాత తల్లికి ఫోన్‌తో వెలుగులోకి ఘటన**

**విషమంగా యువతి పరిస్థితి.. నిందితుడు అరెస్ట్**




గురుగ్రామ్‌లో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రేమ పేరుతో దగ్గరై సహజీవనం చేస్తున్న యువతిపై ఓ యువకుడు అమానుషంగా దాడి చేశాడు. పెళ్లి చేసుకోవాలని కోరినందుకు ఆగ్రహంతో ఆమె ప్రైవేట్ భాగాలపై శానిటైజర్ పోసి నిప్పంటించి, మూడు రోజుల పాటు చిత్రహింసలకు గురిచేశాడు.

త్రిపురకు చెందిన 19 ఏళ్ల యువతి గురుగ్రామ్‌లో బయోటెక్నాలజీ చదువుతోంది. ఆమెకు గతేడాది సెప్టెంబర్‌లో ఓ డేటింగ్ యాప్ ద్వారా ఢిల్లీకి చెందిన శివం (19) పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారి, ఇద్దరూ కలిసి సెక్టార్ 69లోని ఓ ఫ్లాట్‌లో సహజీవనం చేస్తున్నారు. ఫిబ్రవరి 19న పెళ్లి విషయంపై వారిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన శివం ఆమెను గదిలో బంధించి, మెటల్ బాటిల్‌తో తలపై కొట్టి, ప్రైవేట్ భాగాలపై శానిటైజర్ పోసి నిప్పంటించాడు. అంతటితో ఆగకుండా కత్తితో కూడా దాడి చేశాడు.మూడు రోజుల పాటు నరకయాతన అనుభవించిన ఆ యువతి, చివరకు ధైర్యం చేసి తన తల్లికి ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఈ ఘోరం బయటపడింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని గురుగ్రామ్ ఆసుపత్రికి, ఆపై మెరుగైన చికిత్స కోసం ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు శివంను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. నిందితుడిపై హత్యాయత్నం, అత్యాచారం, అక్రమ నిర్బంధం వంటి కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని బాధితురాలి కుటుంబం డిమాండ్ చేస్తోంది. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరుపుతున్నామని, మెడికల్ రిపోర్టులు వచ్చిన తర్వాత మరిన్ని సెక్షన్లు చేర్చే అవకాశం ఉందని గురుగ్రామ్ డీసీపీ తెలిపారు.

health

# ఆరోగ్యం



## చిలగడదుంపతో ఎన్ని ప్రయోజనాలో!

**బరువు తగ్గడంలో సహాయపడే చిలగడదుంప**

**జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే ఫైబర్**

**చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండెను కాపాడే గుణం**

**క్యాన్సర్ వంటి రోగాల నివారణకు దోహదం**

**కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పోషకాలు**




ప్రకృతి మనకు ప్రసాదించిన ఆరోగ్యకరమైన ఆహారాల్లో చిలగడదుంపకు ప్రత్యేక స్థానం ఉంది. తక్కువ ధరకే లభించే ఈ దుంపలో శరీరానికి అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీన్ని రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక రకాల అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

చిలగడదుంపలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మలబద్ధకం, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను నివారిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది చక్కటి ఆహారం. కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన కలిగి, అనవసరమైన స్నాక్స్ తినకుండా నియంత్రిస్తుంది.

శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో చిలగడదుంప కీలకపాత్ర పోషిస్తుంది. తద్వారా గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అలాగే, కాలేయాన్ని ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంచడంలోనూ ఇది తోడ్పడుతుంది.

ఇన్ని ప్రయోజనాలు ఉన్న చిలగడదుంపను ఉడకబెట్టుకుని లేదా కూరగా చేసుకుని తినవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం దీనిని మీ ఆహారంలో భాగం చేసుకోవడం ఎంతో మంచిది.

## కంటి సర్జరీలో కొత్త విప్లవం... స్వయంగా ఇంజెక్షన్ ఇచ్చే రోబో

**కంటి ఆపరేషన్ల కోసం స్వయంచాలిత రోబోను అభివృద్ధి చేసిన చైనా**

**జంతువులపై జరిపిన ప్రయోగాల్లో 100 శాతం విజయం సాధించిన రోబో**

**మనిషి కన్నా 80 శాతం ఎక్కువ కచ్చితత్వంతో సర్జరీ**

**దూర ప్రాంతాల్లోనూ సంక్లిష్టమైన కంటి చికిత్సలకు మార్గం సుగమం**

**వైద్యుల శిక్షణా కాలాన్ని తగ్గించడంలో ఈ రోబో ఉపయోగకరం**




వైద్య సాంకేతిక రంగంలో చైనా పరిశోధకులు ఒక అద్భుతమైన ముందడుగు వేశారు. కంటిలోని అత్యంత సున్నితమైన భాగాల్లోకి స్వయంచాలకంగా (అటానమస్) ఇంజెక్షన్లు ఇచ్చే ఒక రోబోటిక్ వ్యవస్థను విజయవంతంగా అభివృద్ధి చేశారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆటోమేషన్ ఈ రోబోను రూపొందించింది. రెటీనా సంబంధిత వ్యాధులకు చికిత్స అందించే సర్జరీలలో కచ్చితత్వం, భద్రతను ఈ రోబో గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు.

జిన్హువా న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం జంతువులపై జరిపిన ప్రయోగాల్లో ఈ రోబో 100 శాతం విజయవంతంగా సబ్-రెటినల్, ఇంట్రావాస్కులర్ ఇంజెక్షన్లు ఇచ్చింది. ఈ వివరాలను పరిశోధకులు "సైన్స్ రోబోటిక్స్" జర్నల్‌లో ప్రచురించారు. కంటిలోని నిర్మాణాలు చాలా చిన్నవిగా, మృదువుగా ఉండటంతో రెటీనా సర్జరీలు అత్యంత సవాలుతో కూడుకున్నవి. ఈ కొత్త రోబోటిక్ వ్యవస్థ 3ఐ స్పేషియల్ పర్సెప్షన్, ప్రిసైజ్ పొజిషనింగ్ వంటి అధునాతన అల్గారిథమ్‌లతో పనిచేస్తుంది. ప్రయోగాల్లో, మనుషులు చేసే సర్జరీలతో పోలిస్తే ఈ రోబో పొరపాట్లను దాదాపు 80 శాతం తగ్గించింది. సర్జన్ నియంత్రించే రోబోటిక్ సర్జరీతో పోలిస్తే 55 శాతం తక్కువ తప్పులు చేసినట్లు బృందం వెల్లడించింది.

"ఈ ఫలితాలు స్వయంచాలిత కంటి సర్జరీ రోబో ఆచరణ సాధ్యమేనని, ఇంజెక్షన్ల కచ్చితత్వం, భద్రత, స్థిరత్వాన్ని ఇది మెరుగుపరుస్తుందని నిరూపిస్తున్నాయి. ఈ వ్యవస్థ సర్జరీల స్థిరత్వాన్ని పెంచుతుంది. సర్జన్ల శిక్షణా కాలాన్ని కూడా తగ్గిస్తుంది" అని పరిశోధకులు తెలిపారు. ఈ ఆవిష్కరణతో నిపుణులైన సర్జన్లు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో కూడా క్లిష్టమైన కంటి ఆపరేషన్లు చేసే అవకాశం ఏర్పడుతుంది. గతేడాది నవంబర్‌లో చైనా 5+ టెక్నాలజీతో రిమోట్ రోబోటిక్ కంటి సర్జరీ చేసింది, అయితే అది సర్జన్ నియంత్రణలో జరగ్గా, తాజా ఆవిష్కరణ స్వయంగా పనిచేయడం విశేషం.

## ఆ ఒక్క తప్పు చేయకుంటే కాఫీతో బోలెడు ప్రయోజనాలు ఉన్నాయట.. అదేంటంటే!

**కాఫీ తాగే అలవాటు వల్ల గుండె జబ్బుల రిస్క్ తగ్గుతుందంటున్న నిపుణులు**

**మధుమేహం, కాలేయ సమస్యలనూ తగ్గిస్తుందని గత పరిశోధనలలో వెల్లడి**

**రోజుకు 2 నుంచి 4 కప్పుల కాఫీ తాగడం మేలు.. అదీ ఉదయం పూట మాత్రమేనంటున్న నిపుణులు**




ఉదయాన్నే ఓ కప్పు కాఫీ తాగిన తర్వాతే చాలామందికి ఆ రోజు మొదలవుతుంది. రోజులో నాలుగైదుసార్లు తాగకుండా ఉండలేని కాఫీ ప్రియులకు శాస్త్రవేత్తలు శుభవార్త చెప్పారు. కాఫీ తాగే అలవాటుతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. గుండె జబ్బుల ముప్పును తగ్గించడం నుంచి కాలేయ సమస్యల రిస్క్ ను తగ్గించడం దాకా.. చాలా ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఉదయాన్నే కాఫీ తాగడం వల్ల శరీరానికి ప్రయోజనం కలుగుతుందని, మధ్యాహ్నం తర్వాత కానీ సాయంత్రం కానీ తాగితే మాత్రం ఈ ప్రయోజనాలు దక్కకపోగా అనర్థాలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఈ మేరకు యురోపియన్ స్టడీ ఆఫ్ కార్డియాలజీ నిర్వహించిన తాజా అధ్యయనంలో కాఫీ తాగే అలవాటు ఉన్న వారు మిగతా వారితో పోలిస్తే ఎక్కువ కాలం జీవిస్తారని తేలింది. రోజుకు 2 నుంచి 4 కప్పుల కాఫీ తాగడం ద్వారా ఈ ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. అయితే, మధ్యాహ్నం తర్వాత కానీ సాయంత్రం కానీ కాఫీ తాగడం వల్ల మేలు కన్నా కీడే ఎక్కువని హెచ్చరించారు.

మధ్యాహ్నం తర్వాత కాఫీ తాగితే ఏమవుతుందంటే..

మధ్యాహ్నం తర్వాత లేదా సాయంత్రం పూట కాఫీ తాగిన తర్వాత శరీరంలోకి చేరే కెఫిన్ మన మెదడులో కీలకమైన అడెనోసిన్ రసాయనాన్ని అడ్డుకుంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. రాత్రిపూట మనం హాయిగా నిద్రించేందుకు ఈ రసాయనం తోడ్పడుతుందని చెబుతూ.. కెఫిన్ ఈ రసాయనాన్ని అడ్డుకోవడం వల్ల నిద్రలేమి సమస్యతో ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు. అంతేకాదు, సాయంత్రం పూట తాగే కాఫీ వల్ల మన శరీరంలోని జీవగడియారం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఫలితంగా నిద్రలేమి.. తద్వారా అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయని శాస్త్రవేత్తలు హెచ్చరించారు.

## నెల రోజుల పాటు చక్కెర తినడం మానేసి చూడు...



హైదరాబాద్ ఫిబ్రవరి 3 మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.

కొవ్వు కరుగుతుంది..

అయితే డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్దకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

# విటమిన్ బి7 ఉండే ఈ ఆహారాలను తీసుకోండి.. ఆరోగ్యంగా ఉండండి..



హైదరాబాద్ ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మెరిసే, అందమైన, ఒత్తైన జుట్టును సొంతం చేసుకోవాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. దీని కోసం ఎన్నో రకాల ప్రయత్నాలు కూడా చేస్తూ ఉంటారు. ఖరీదైన నూనెలను, సీరమ్ లను వాడడం, హెయిర్ ప్యాక్ లను వాడడం వంటివి కూడా చేస్తూ ఉంటారు. అయినప్పటికీ చాలా మంది వారు కోరుకున్న జుట్టును పొందలేకపోతున్నారు. జుట్టు అందంగా, ఆరోగ్యవంతంగా ఉండాలంటే హెయిర్ ప్రొడక్ట్స్ ను వాడడంతో పాటు పోషకాహారాన్ని తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. జుట్టు పెరుగుదలకు విటమిన్ బి7 ఎంతో అవసరం. దీనిని బయోటిన్ అని కూడా పిలుస్తారు. జుట్టు, చర్మం, గోళ్ల ఆరోగ్యానికి ఈ విటమిన్ ఎంతో అవసరం. శరీరానికి విటమిన్ బి7 తగినంత అందినప్పుడు మాత్రమే జుట్టు ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు జుట్టు సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి.కోడిగుడ్లు, బాదంపప్పు..జుట్టు ఆరోగ్యంగా ఉండాలనుకునే వారు జుట్టు సమస్యలు ఎక్కువగా ఉన్నవారు బయోటిన్ ఎక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. కనుక బయోటిన్ ఎక్కువగా ఉండే ఆహరాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. బయోటిన్ ఎక్కువగా ఉండే ఆహారాల్లో గుడ్డు కూడా ఒకటి. ఇది జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. గుడ్డును ఉడికించి తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. బాదంపప్పులో కూడా బయోటిన్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన కొవ్వులు అంది జుట్టు మెరుస్తుంది. చిలగడదుంపలను తీసుకోవడం వల్ల కూడా జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీనిలో బయోటిన్ తో పాటు బీటాకెరోటీన్ సమృద్ధిగా ఉంటుంది. వీటిని తినడం వల్ల తలచర్మ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.పాలకూర, చేపలు..ఆహారంలో భాగంగా పాలకూరను తీసుకోవడం వల్ల అందమైన జుట్టును సొంతం చేసుకోవచ్చు. పాలకూరను తీసుకోవడం వల్ల బయోటిన్ తో పాటు ఐరన్ కూడా లభిస్తుంది. ఇవి జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. సాల్మన్ చేపలను తీసుకోవడం వల్ల జుట్టు అందంతో పాటు ఆరోగ్యం కూడా పెరుగుతుంది. వీటిలో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు తల చర్మాన్ని తేమగా ఉంచడంతో పాటు జుట్టు మెరిసేలా చేస్తాయి. పొద్దు తిరుగుడు గింజలు కూడా జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయి. వీటిలో బయోటిన్ తో పాటు విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇవి రెండు కూడా జుట్టు పెరుగుదలకు సహాయపడతాయి.మటన్ లివర్, పుట్ట గొడుగులు..ఇక అవకాడోలు కూడా పుష్కలంగా బయోటిన్ ను కలిగి ఉంటాయి. వీటిలో ఉండే ఆరోగ్యవంతమైన కొవ్వులు జుట్టు పెరుగుదలకు సహాయపడతాయి. మటన్ లివర్ ను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలంగా బయోటిన్ లభిస్తుంది. దీంతో జుట్టు ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు జుట్టు పెరుగుదల కూడా వేగంగా ఉంటుంది. అరటిపండ్లల్లో కూడా తగిన మోతాదులో బయోటిన్ ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల జుట్టు బలంగా తయారవుతుంది. పుట్టగొడుగులు కూడా జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో బయోటిన్ తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల జుట్టు మూలాలు దెబ్బతినకుండా ఉంటాయి.ఈ విధమైన ఆహారాలను తీసుకోవడం వల్ల జుట్టు రాలడం తగ్గడంతో పాటు అందమైన, ఒత్తైన జుట్టును సొంతం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## మన శరీరం ఫిట్‌గా ఉండేందుకు 15 ముఖ్యమైన విషయాలు :డాక్టర్. డిసి. తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్

కరీంనగర్ డాక్టర్. డిసి. తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్, కరీంనగర్ మాట్లాడుతూ ఉదయం త్వరగా లేవడం శరీరానికి చాలా మంచిది. ప్రతి రోజు ఒకే సమయానికి లేస్తే జీవ గడియారం సరిగా పనిచేస్తుంది. ఉదయపు స్వచ్ఛమైన గాలి శరీరానికి శక్తిని అందిస్తుంది. రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు ఇది సహాయపడుతుంది.ప్రతిరోజూ వ్యాయామం చేయడం అవసరం. కనీసం ముప్పై నిమిషాలు వేగంగా నడవాలి. యోగా లేదా తేలికపాటి స్ట్రెచింగ్ చేయవచ్చు. ఇది గుండె మరియు కండరాలను బలపరుస్తుంది.సమతుల ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి ముఖ్యము. కూరగాయలు మరియు పండ్లు ఎక్కువగా తినాలి. ప్రోటీన్ ఉన్న ఆహారం రోజూ ఉండాలి. ఫాస్ట్ ఫుడ్ తగ్గించడం మంచిది.రోజుకు తగినంత నీరు తాగాలి. రెండు నుండి మూడు లీటర్లు తాగడం ఉత్తమం. నీరు శరీరంలోని మలినాలను బయటకు పంపుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.సరైన నిద్ర తీసుకోవాలి. రోజుకు ఆరు నుండి ఎనిమిది గంటలు నిద్ర అవసరం. నిద్ర శరీరానికి విశ్రాంతి ఇస్తుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది.ఒత్తిడిని తగ్గించుకోవాలి. ప్రతిరోజూ కొంతసేపు ధ్యానం చేయాలి. లోతైన శ్వాసాభ్యాసాలు చేయడం మంచిది. మనసు ప్రశాంతంగా ఉంటుంది.చెడు అలవాట్లను మానాలి. పొగ త్రాగడం ఆరోగ్యానికి హానికరం. మద్యం సేవించడం తగ్గించాలి. శరీర అవయవాలు రక్షితంగా ఉంటాయి.ఎక్కువసేపు కూర్చోవడం మానాలి. ప్రతి గంటకు ఒకసారి లేచి నడవాలి. శరీరాన్ని స్ట్రెచింగ్ చేయాలి. వెన్ను మరియు కాళ్ల నొప్పులు తగ్గుతాయి.బరువు నియంత్రణలో ఉంచాలి. అధిక బరువు అనేక రోగాలకు కారణం అవుతుంది. సమతుల ఆహారం తీసుకోవాలి. నియమితంగా వ్యాయామం చేయాలి.సూర్యకాంతి అవసరం. ఉదయం సూర్యరశ్మిలో కొంతసేపు గడపాలి. ఇది విటమిన్ డి. అందిస్తుంది. ఎముకలు బలపడతాయి.ఆహారాన్ని నెమ్మదిగా నమిలి తినాలి. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. అజీర్ణ సమస్యలు తగ్గుతాయి. శరీరం పోషకాలను సరిగా గ్రహిస్తుంది..సానుకూల ఆలోచనలు కలిగి ఉండాలి. తరచూ నవ్వడం ఆరోగ్యానికి మంచిది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. శరీరం ఉల్లాసంగా ఉంటుంది.నియమిత ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. వయస్సు పెరిగే కొద్దీ ఇది ముఖ్యమవుతుంది. వ్యాధులను ముందుగానే గుర్తించవచ్చు. సరైన చికిత్స పొందవచ్చు.ప్రోటీన్ సమృద్ధిగా తీసుకోవాలి. పప్పులు మరియు గుడ్లు మంచివి. కండరాలు బలపడతాయి. శక్తి పెరుగుతుంది.సమయపాలన పాటించాలి. సమయానికి భోజనం చేయాలి. సమయానికి నిద్రపోవాలి. శరీరం దీర్ఘకాలం ఫిట్‌గా ఉంటుంది.. డాక్టర్. డి సి. తిరుపతిరావు ఎండి సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ తెలిపారు.

# గుండె ఆరోగ్యానికి ఏ నూనె మంచిది?

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో వంట నూనె ఎంపిక చాలా కీలకమైనది. భారతీయ వంటల్లో నూనె తప్పనిసరి అయినప్పటికీ.. దాన్ని ఎంత పరిమాణంలో వాడుతున్నామన్నది చాలా ముఖ్యం. ఎక్కువ నూనె వాడటం వల్ల కొలెస్ట్రాల్ పెరిగి.. గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వంట నూనె ఆహారానికి రుచి, వాసన, మెత్తదనం ఇస్తుంది. కూరగాయలు, మాంసాహారం సమానంగా ఉడికేందుకు కూడా సహాయపడుతుంది. అయితే నూనెను పదే పదే వేడి చేయడం లేదా అధికంగా వాడటం గుండెకు హానికరం. ఇటీవలి కాలంలో గుండెపోటు కేసులు పెరగడానికి అధిక నూనె వినియోగం కూడా ఒక కారణంగా నిపుణులు భావిస్తున్నారు.

రోజుకు ఎంత నూనె వాడాలి?

వైద్యుల ప్రకారం.. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి రోజుకు సుమారు 25 నుండి 30 మిల్లీలీటర్ల (సుమారు 2 టేబుల్ స్పూన్లు) నూనె మాత్రమే తీసుకోవాలి. వారానికి మొత్తం 150 నుండి 170 మిల్లీ లీటర్ల నూనె సరిపోతుంది. ఈ పరిమాణంలో వంట నూనెతో పాటు వేయించిన ఆహారం, బేకరీ పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్‌లో ఉండే నూనె కూడా లెక్కలోకి వస్తుంది.

ఎక్కువ నూనె వాడితే ఏమవుతుంది?

అధికంగా నూనె తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీనివల్ల గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. స్ట్రోక్ వచ్చే అవకాశం కూడా పెరుగుతుంది. అలాగే ఊబకాయ సమస్య తలెత్తడంతో పాటూ అధిక రక్తపోటు, మధుమేహ ప్రమాదం పెరుగుతుంది.

గుండె ఆరోగ్యానికి ఏ నూనె మంచిది?

నిపుణుల ప్రకారం.. గుండె ఆరోగ్యానికి ఈ నూనెలు మంచివి:

ఆలివ్ నూనె

వేరుశెనగ నూనె

నువ్వుల నూనె

చియా సీడ్ ఆయిల్

అవోకాడో ఆయిల్

జాగ్రత్తలు..

నూనెను పదే పదే వేడి చేయకూడదు.

నాన్‌స్టిక్ లేదా ఇనుప పాత్రలు వాడితే తక్కువ నూనె సరిపోతుంది.

నూనెను చెంచాతో కొలిచి వాడాలి.

వేయించిన ఆహారం, జంక్ ఫుడ్ తగ్గించాలి.

తక్కువ నూనె వాడటం, సరైన నూనె ఎంపిక చేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# బాలికలకు శాపం.. ముందస్తు రుతుక్రమం

## ముందుతరం వారితో పోలిస్తే ఐదేళ్ల వ్యత్యాసం వాతావరణంలో మార్పులు, పోషకాహార లేమి తో చిన్న వయస్సులో రుతుక్రమం

హైదరాబాద్ ఆడపిల్ల జీవితంలో 'రుతుక్రమం (రజస్వల)' కీలకమైన ఘట్టం. శారీరకంగా, మానసికంగా పలుమార్పులు చోటుచేసుకునే సహజ సందర్భం. హార్మోన్ల స్థాయిల్లో హెచ్చుతగ్గులవల్ల కలిగే ఈ ప్రక్రియ, సాధారణంగా 13 15 ఏళ్ల వయస్సుమధ్యలో చోటుచేసుకుంటుంది. యవ్వనంలోకి అడుగిడుతున్న ఆడపిల్లలో రుతుక్రమం మొదలవుతుంది. ఈస్ట్రోజన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్ల మార్పుల వల్ల అండాశయంనుంచి అండం విడుదలకావడంతో ఈ ప్రక్రియ ఆరంభమవుతుంది. ఇది స్త్రీ పునరుత్పత్తి ఆరోగ్యానికి, శారీరక ఎదుగుదలకు, గర్భధారణ సామర్థ్యానికి సంకేతంలా నిలుస్తుంది. కానీ, వాతావరణంలో మార్పులు, పోషకాహార లేమి తదితర కారణాల వల్ల చిన్న వయస్సులోనే రుతుక్రమం గురవుతున్న బాలికల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీంతో పిల్లలతోపాటు తల్లిదండ్రులు మానసిక క్షభకు గురవుతున్నారు. ఎదిగీఎదగని వయస్సు, ఆడుతూపాడుతూ గడిపే కాలం, ప్రాథమిక తరగతి చదువుతున్న క్రమంలో (అంటే 9..11 ఏళ్ల వయస్సు) రుతుక్రమం (ఎర్లియర్లీ మెచ్యూర్) చోటుచేసుకుంటోంది. ఆహారపు అలవాట్లు మారడం, అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, తీసుకునే ఆహారంలో ఐరన్ లోపించడం, బాడీ మాస్ ఇండెక్స్(బిఎంఐ) అనూహ్యంగా పెరిగి హార్మోన్ల సమతుల్యత దెబ్బతినడంతో చిన్నవయస్సులోనే రుతుక్రమం చోటుచేసుకుంటోంది. హోమ్ అప్లయెన్సెస్ ఊహతెలియని వయస్సులో పిరియడ్ సైకిల్ ప్రారంభం కావడంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. చిన్నారులకు అవగాహన కల్పించినా ఏమేరకు నెట్టుకురాగలుగుతారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి, రుతుక్రమం యవ్వనానికి చేరువవుతోన్న అమ్మాయిల్లో శారీరకంగా, మానసికంగా పలు మార్పులు రావడం సహజం. హార్మోన్ల స్థాయిలో హెచ్చుతగ్గులవల్ల వచ్చే ఈ మార్పులు టీనేజీ దశలో ప్రవేశించి అమ్మాయిలకు అసౌకర్యం, ఇబ్బందిని కలుగజేస్తున్నాయి. పైగా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముంది. ముఖ్యంగా మెటబాలిక్ సింద్రోమ్, టైప్2 మధుమేహం, హైపర్ టెన్షన్ వంటి సమస్యలు వచ్చే అవకాశముంది. రుతుక్రమం అయిన తొలి ఐదారేళ్ల వరకు నాణ్యమైన అండాలు ఉత్పత్తి అయినప్పటికీ, చివరి పదేళ్లలో అండాల ఉత్పత్తిలో నాణ్యత తగ్గడం, ఆలస్యంగా వివాహం చేసుకోవడం వల్ల సంతానోత్పత్తి తగ్గుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రతి బాలిక తన జీవితకాలంలో ఒక నిర్దిష్ట వయస్సులో రుతుక్రమం కావడం జరుగుతుంది. కొంతమందిలో పన్నెండేళ్ల వయస్సు దాటినప్పటికీ రుతుక్రమం కోసం ఎదురుచూస్తుంటారు. గతంలో పదహారేళ్ల వయస్సులో రుతుక్రమం అయ్యేది. తర్వాత కాలంలో చాలా మంది అమ్మాయిలు 12 15 ఏళ్ల వయస్సులో రుతుక్రమం జరుగుతుండేది. ప్రస్తుత కాలంలో బాలికలు తమ మొదటి పీరియడ్‌ను చాలా ముందుగానే పొందుతున్నారు. ముందుతరం వారితో పోలిస్తే ఐదేళ్ల వ్యత్యాసముంటోంది. సాధారణంగా బాల్యం చివరి దశలో ప్రారంభమయ్యే ప్రక్రియ ఇది. యుక్త వయస్సు రావడానికి ముందు హైపోథలమస్, పిట్యూటరీ, అండాశయాలు పరిపక్వ స్థితికి చేరుకుంటాయి. పదేళ్ల వయస్సులో మొదలైన ప్రక్రియ రెండు మూడేళ్లు కొనసాగి అప్పుడు రుతుక్రమంకు దారితీసేది. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా పదేళ్ల కన్నా తక్కువ వయస్సులో రుతుక్రమం రావడం అసాధారణ సందర్భంగానే వైద్యులు పేర్కొంటున్నారు.చిన్న వయస్సులో రుతుక్రమం రావడానికి దారితీస్తున్న పరిస్థితులపై ప్రపంచవ్యాప్తంగా పలు పరిశోధనలు జరుగుతున్నాయి. ఆర్థిక నేపథ్యం నుంచి ప్రతి అంశం వారిని ప్రభావితం చేస్తున్నట్లు గుర్తించారు. కొంతమంది బాలికలు ఐదేళ్ల వయస్సులోనే రుతుక్రమంకు గురవుతున్నట్లు తేలింది. ఇందుకు ఆర్థిక అంశాలు మాత్రమే కాకుండా శారీరక అంశాలు, వాతావరణ పరిస్థితులు, పుట్టిన శిశువు తీసుకునే మందులు ప్రభావితం చేస్తున్నట్లు తేల్చారు. యాంటీబయోటిక్స్ ఒక కారణంగా దక్షిణ కొరియాలో జరిగిన ఓ అధ్యయనం తెలియజేస్తోంది. రెండు లక్షలమంది ఆడపిల్లలపై జరిపిన ఈ అధ్యయనం.. పుట్టిన పిల్లల దగ్గర్నుంచీ తొమ్మిదేళ్ల వయస్సు వరకూ గమనించారు. పుట్టిన తొలి మూడు నెలల్లో యాంటీబయోటిక్స్ తీసుకున్న ఆడశిశువుల్లో 22% మంది ఎనిమిదేళ్లకంటే ముందుగానే రుతుక్రమం అవుతున్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితిని సిపిపి (సెంట్రల్ ప్రికాషియస్ ప్యుబర్టీ) అంటారు. పుట్టిన తొలి రెండు వారాల్లో యాంటీ బయోటిక్స్ ఇస్తే ఈ సమస్య తీవ్రంగా ఉంటుందంటున్నారు. శరీరంలోకి చేరిన యాంటీ బయోటిక్స్ ఆడపిల్లల హార్మోన్ల వ్యవస్థని అదుపు తప్పేలా చేయడం వల్లనే త్వరగా రుతుక్రమం అవుతుందని ఈ అధ్యయనం తెలియజేస్తున్నది. అధిక బరువు, ఊబకాయం, శారీరక శ్రమ తక్కువగా ఉండడం కారణమవుతున్నాయి. మొబైల్, టివిలను ఎక్కువ సమయం వీక్షించే బాలికల్లో యుక్తవయస్సు త్వరగా ప్రారంభమవుతుందని, ఇవి తమ మొదటి పీరియడ్స్‌ను ప్రేరేపిస్తుందని వివరించారు. బాలికల్లో ఎర్లీ పీరియడ్స్‌కు పరిసర ప్రాంతాలు కూడా ఓ కారణంగా నిలుస్తుందని పరిశోధకులు తెలియజేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా 70 శాతానికిపైగా ఆడపిల్లలకు 'రుతుక్రమం' విషయం తెలియదనే చెప్పాలి. ఒకసారి పీరియడ్స్ ప్రారంభమవుతే, శారీరక పరిశుభ్రత చాలా అవసరం. ఈ విషయంలో కూతురితో మాట్లాడటానికి తల్లి చొరవచూపాలి. జరిగే పరిణామాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కూలంకషంగా చర్చించాలి. తీసుకునే ఆహారం విషయంలో పోషకాలకు చోటివ్వడం, ఆత్మనూన్యతకు గురికాకుండా అప్రమత్తం చేయడం తల్లిపాత్ర కీలకంగా ఉంటుంది. శరీర నిర్మాణం, రుతుచక్రం రావడం గురించి విపులంగా వివరించాలి. ఇదిలా వుండగా, ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కీలకమైంది. ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన ఆదేశాల ప్రకారం విద్యార్థినుల నెలసరి ఆరోగ్య సమస్యను భారత రాజ్యాంగంలోని జీవించే హక్కులో భాగమని విశ్లేషించింది. నెలసరి నిర్వహణ వారి విద్యార్జన సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తే, అది వారి విద్యాహక్కునూ, వారికి గల గౌరవప్రదమైన జీవించే హక్కునూ ప్రభావితం చేసినట్టేనని పేర్కొంది. కాబట్టి, ఆడపిల్లల ఆర్యోగాన్ని పరిరక్షించే విధానాలు ప్రభుత్వాలు చేపట్టడం అత్యంత ఆవశ్యకతగా పేర్కొంది.

# ఇంగువ కథ




పెద్దిభొట్ల సుబ్బరామయ్య 'ఇంగువ' కథ ప్రసిద్ధమే! చావుబతుకుల్లో ఉన్న ఓ చదువరిని పలకరిద్దామని వచ్చిన మిత్రుణ్ణి చూసి, ఆ చివరి క్షణాల్లో కూడా తెలియనిదాన్ని తెలుసు కోవాలనే జిజ్ఞాసతో "ఇంగువ ఎలా తయార వుతుందంటావ్...?" అని అడుగుతాడు. నిజానికి చాలామందికి ఇంగువ ఉత్పత్తి తెలీదు. క్యారెట్ కుటుంబానికి చెందిన ఇంగువ మొక్క వేళ్లు క్యారెట్ మాదిరిగానే ఉంటాయి. వాటికి గాటుపెడితే వచ్చే జిగురుపదార్థం (ఓలియో-గమ్-రెసిన్)ని హింగు లేదా ఇంగువ అంటారు.

ఆహార రుచిని, వాసనను పెంచేందుకు వేల యేళ్లుగా ఇంగువని వాడుతున్నారు. ఇది ఉగ్ర గ్రంథి. చాలా ఘాటైన వాసన కలది. అందుకని మాంసంలోని నీచు వాసనని కప్పి ఉంచటానికి దీన్ని ఎక్కువగా వాడతారు. ఇంగువకి తూర్పు దేశాల్లోనే ప్రాచుర్యం ఎక్కువ. 'ఇంగువ కట్టిన గుడ్డ'ని ఇంగువ వాసన ఎన్నాళ్ళకూ వదలక పోవటం దీని తీక్షణతకు సాక్ష్యం.

ఉల్లి, వెల్లుల్లి తమో గుణాన్నిపెంచుతాయని, ఇంగువ మేథాసంపత్తిని వృద్ధి చేస్తుందనీ

శాకాహారులు నమ్ముతారు. ఇది అపోహ కాదు. మెదడులో నరాల ఉత్తేజాన్నిచ్చే గుణంతో పాటు, అల్జీమర్స్ లాంటి మతిమరపు వ్యాధుల్లో మెదడు కణాల పుట్టుకకు సాయపడ్తుంది. మూర్ఛలు, డిమెన్షియా లాంటి వ్యాధులు రాకుండా నివారిస్తుంది. మనసుకు ఉత్సాహాన్నిస్తుంది.

బిగుసుకున్న కండరాలను ముఖ్యంగా శ్వాసనాళాల కండరాల్లో వచ్చే బిగింపు తగ్గిస్తుంది. నాణ్యమైన ఇంగువతో సమానంగా ముద్దకర్పూరాన్ని తేనెతో నూరి పెసర గింజంత మాత్రలు చేసి 1-2 వేసుకుంటే వెంటనే ఆయాసం తగ్గుతుంది. పేగులు, లివర్ లాంటి అవయవాలలోని సున్నిత కండరాల్ని కూడా రిలాక్స్ చేస్తుంది.

సినిమా





# '56 డేస్' (అమెజాన్ ప్రైమ్) సిరీస్ రివ్యూ!



'56 డేస్ ' .. హాలీవుడ్ థ్రిల్లర్ సిరీస్. సైకలాజికల్ థ్రిల్లర్ ను టచ్ చేస్తూ సాగే మిస్టరీ థ్రిల్లర్ ఇది. కేథరిన్ ర్యాన్ హోవార్డ్ రాసిన నవల ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు. 2021లో అత్యధికంగా అమ్ముడైన నవలలో ఇది ఒకటి. డవ్ కామెరాన్ - అవాన్ జోగియా ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్, ఇంగ్లిష్ తో పాటు ఇతర భాషల్లోను 8 ఎపిసోడ్స్ తో అందుబాటులోకి వచ్చింది. ఈ 8 ఎపిసోడ్స్ కి నలుగురు దర్శకత్వం వహించారు.

'బోస్టన్'లోని ఓ ఇంట్లో ఒక దారుణమైన హత్య జరుగుతుంది. బాత్ టబ్ లో శవం కుళ్లిన స్థితిలో లభిస్తుంది. ఆ శవం పురుషుడిదా? స్త్రీకి సంబంధించిందా? అనే విషయం తేల్చడం సవాలుగా మారుతుంది. మిస్టరీగా మారిన ఈ మర్డర్ కేసును పరిష్కరించడానికి, ఆఫీసర్ 'లియార్డిన్' (కార్లా) ఆమె భర్త కార్ల్ ( డోరియన్) రంగంలోకి దిగుతారు. వాళ్లు ఆ ఇంటిని అణువణువున పరిశీలన చేస్తారు. హత్య జరిగిన ఆ ఇంట్లో అలీవర్ (అవన్ జోగియా) సియారా (కామెరాన్) ఉండేవారని తెలుసుకుంటారు. వాళ్లిద్దరూ ప్రేమికులై ఉంటారనే ఒక నిర్ధారణకు వస్తారు.

హత్య జరగడానికి ముందు, '56 రోజులు' వెనక్కి వెళితే, సియారా - అలీవర్ ల ప్రేమకథ కళ్లముందుకు వస్తుంది. అలీవర్ విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ ఉంటాడు. గతం తాలూకు గాయం అతణ్ణి వెంటాడుతూ ఉంటుంది. అందువలన డాక్టర్ 'డాన్' దగ్గర అతను కౌన్సిలింగ్ తీసుకుంటూ ఉంటాడు. అలాంటి పరిస్థితులలోనే అతనికి సియారా (కామెరాన్) పరిచయమవుతుంది. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారుతుంది. ఇద్దరూ సహజీవనం చేయడం మొదలు పెడతారు.

అలీవర్ తన జీవితంలోని కొన్ని రహస్యాలను సియారాతో పంచుకోలేని పరిస్థితి. ఇక వేరే ఊళ్లో సియారా ఫ్యామిలీ చాలా ఆర్థికపరమైన ఇబ్బందుల్లో ఉంటుంది. అందువలన అలీవర్ ఎకౌంటులో నుంచి కొంత ఎమౌంట్ తీసి తన వాళ్లకి పంపించాలని నిర్ణయించుకుంటుంది. గతంలో తన కుటుంబానికి అలీవర్ చేసిన ద్రోహానికి అలా చేయడమే కరెక్ట్ అని ఆమె భావిస్తుంది. ఒకానొక దశలో ఒకరి మనసులో ఏముందో ఒకరికి తెలిసిపోతుంది. ఆ తరువాతనే హత్య జరుగుతుంది. ఎవరు ఎవరిని హత్య చేశారు? ఒకరితో ఒకరికి ముడిపడిన ఆ గతం ఏమిటి? అనేది కథ.

'56 డేస్'లో ఒక ప్రేమజంట జీవితంలో ఎలాంటి మలుపులు చోటుచేసుకున్నాయి అనే ఈ కథ, ముందుగా నవలగా వ్రాయబడింది. ఆ తరువాతనే సిరీస్ గా ఇది తెరకెక్కింది. అందువల్లనే ఈ సిరీస్ ను చూస్తుంటే, ఒక పుస్తకాన్ని చదువుతున్నట్టుగానే అనిపిస్తూ ఉంటుంది. కథ .. కథలోని పాత్రలను డిజైన్ చేసిన తీరు చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. స్క్రీన్ ప్లే ఈ కథకి ప్రధానమైన బలం .. ప్రాణం అని చెప్పాలి.

కథ అంతా కూడా అంతకుముందు .. ప్రస్తుతం అన్నట్టుగా సాగుతుంది. అంటే ఒక వైపున ప్రేమకథను .. మరో వైపున హత్యకి సంబంధించిన ఇన్వెస్టిగేషన్ కొనసాగుతూ ఉంటాయి. గతానికి సంబంధించిన కథ పూర్తయ్యే సమయానికి ప్రస్తుతానికి సంబంధించిన కథ ముగింపుకు వస్తుంది. అయితే ఈ ముగింపులో ట్విస్ట్ ఉంటుంది. చివరివరకూ ఈ ట్విస్ట్ ను అలా హోల్డ్ లో పెట్టేసి కథనాన్ని నడిపించిన తీరు ఆసక్తికరంగా ఉంటుంది.

కథలో పాత్రల సంఖ్య ఎక్కువే. ప్రతి పాత్రకి ఒక ప్రయోజనం ఉంటుంది. హీరో వైపు నుంచి .. హీరోయిన్ వైపు నుంచి .. హత్య కేసును ఇన్వెస్టిగేషన్ చేసే పోలీస్ ఆఫీసర్స్ వైపు నుంచి .. ఇలా అన్ని కోణాల్లో ఈ కథను అల్లుకుంటూ వచ్చిన తీరు ఆకట్టుకుంటుంది. ఒక్కో ఎపిసోడ్ నిడివి ఎక్కువగానే ఉంటుంది. అలాగని చెప్పి బోర్ అనిపించదు. ఎందుకంటే నెక్స్ట్ కథకు అవసరమైన ఫీడ్ ను ఈ ఎపిసోడ్ అందిస్తూ ఉంటుంది.

ఈ కథలో లవ్ ఉంది .. ఘాటైన రొమాన్స్ ఉంది .. సస్పెన్స్ ఉంది .. ఆడియన్స్ గెస్ చేయలేని ట్విస్టులు ఉన్నాయి. ముఖ్యంగా పాత్రలను ఎత్తుకోవడం .. వాటికి సరైన ముగింపును ఇవ్వడం కరెక్టుగా అనిపిస్తుంది. అలాగే ప్రధానమైన పాత్రలు చిత్రంగా ప్రవర్తించడానికి కారణంగా చూపించిన ఫ్లాష్ బ్యాక్ కూడా బలమైన డ్రామాతోనే కనిపిస్తుంది.

ప్రధానమైన పాత్రలను డిజైన్ చేసిన విధానం బాగుంది. ప్రతి పాత్ర చివరివరకూ ఏదో ఒక సందర్భంలో కనెక్ట్ అవుతూనే ఉంటుంది. సాధారణంగా నవలలో పాత్రలు .. వాటి స్వరూప స్వభావాలు .. హావభావాలు .. డ్రామా .. ఆ పాత్రల ముగింపు పెర్ఫెక్ట్ గా అనిపిస్తూ ఉంటాయి. నవలను సిరీస్ గా తీయడం వలన, అంతే పెర్ఫెక్ట్ గా ఈ కంటెంట్ కనిపిస్తుంది. అయితే ఇది పెద్దలు మాత్రమే చూడదగిన సిరీస్. అక్కడక్కడా అభ్యంతరకరమైన సన్నివేశాలు ఉన్నాయి. అవి కూడా కాస్త ఘాటైనవే.


ఒక్కోసారి ప్రేమలో నుంచి ద్వేషం పుడుతుంది. కానీ ఆ ద్వేషంలో నుంచి కూడా ప్రేమ పుడుతుందని నిరూపించిన కథ ఇది. ప్రేమికుల మధ్య రహస్యాలు ఉండటం సహజం. అయితే ఆ ప్రేమ కోసం రహస్యాలను అంగీకరించడం కూడా జరుగుతూనే ఉంటుందని చాటిన సిరీస్ ఇది. ఈ జోనర్ ను ఇష్టపడేవారు ఇంట్రెస్టింగ్ డ్రామాతో నడిచే ఈ కంటెంట్ ను అడల్ట్ కేటగిరిలో చూడొచ్చు.

# ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు: వరలక్ష్మి శరత్ కుమార్

### డైరెక్టర్ గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన వరలక్ష్మి
### 'సరస్వతి' సినిమాతో దర్శకురాలిగా మారిన వరలక్ష్మి
### గోపీచంద్ మలినేని తనకు లైఫ్ ఇచ్చారని వ్యాఖ్య

తన విలక్షణ నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకున్న నటి వరలక్ష్మి శరత్‌కుమార్. సీనియర్ నటుడు శరత్ కుమార్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి వచ్చిన వరలక్ష్మి... ఆ తర్వాత ఇండస్ట్రీలో తన కాళ్లపై తాను నిలబడింది. ఇప్పుడు దర్శకురాలిగా తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. డైరెక్టర్ గా తన మొదటి చిత్రం 'సరస్వతి'తో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ... "డైరెక్టర్ గోపీచంద్ మలినేని సార్ నా గురువు, మెంటార్, గైడ్. ఆయన కారణంగానే నేను ఈ రోజు ఇక్కడ ఉన్నాను. ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు" అంటూ ఆమె భావోద్వేగానికి గురైంది. ఇండస్ట్రీలో అమ్మాయిలు సర్వైవ్ అవడం చాలా కష్టమని, వారికి సపోర్ట్ ఇవ్వాలని ఆమె కోరింది.కనబడకుండా పోయిన కూతురి కోసం ఒక అమ్మ ఎంత దూరం వెళుతుందో చూపించే కథాంశంతో 'సరస్వతి' తెరకెక్కుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రియమణి, ప్రకాశ్ రాజ్ తదితరులు నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. దోసా డైరీస్ బ్యానర్ పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్: ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, నటిగా నివేతా థామస్




కొచ్చి వేదికగా 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ ప్రదానోత్సవం

అత్యధికంగా పుష్ప 2 చిత్రానికి అవార్డులు

ఉత్తమ దర్శకుడిగా సుకుమార్, సహాయ నటుడిగా అమితాబ్ బచ్చన్

70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ ప్రదానోత్సవం కొచ్చి వేదికగా అట్టహాసంగా జరిగింది. దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. 'పుష్ప 2: ది రూల్' కోసం ఉత్తమ నటుడు (తెలుగు) అవార్డును అల్లు అర్జున్ అందుకున్నారు. అల్లు అర్జున్‌కు ఇది ఏడవ ఫిల్మ్ ఫేర్ అవార్డు కావడం గమనార్హం. మెగాస్టార్ చిరంజీవి పేరిట ఉన్న దీర్ఘకాల రికార్డును అల్లు అర్జున్ సమం చేశారు. '35: చిన్న కథ కాదు' చిత్రానికి గాను నివేతా థామస్ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. 'పుష్ప-2' సినిమాకు ఎక్కువ అవార్డులు వచ్చాయి. టాలీవుడ్‌కు పలు అవార్డులు దక్కాయి.

ఉత్తమ చిత్రం: పుష్ప 2

ఉత్తమ దర్శకుడు: సుకుమార్ (పుష్ప 2)

ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్: పుష్ప 2

ఉత్తమ సహాయ నటుడు: అమితాబ్ బచ్చన్ (కల్కి2898 ఏడీ)

ఉత్తమ సహాయ నటి: అంజలి (గ్యాంగ్ ఆఫ్ గోదావరి)

ఉత్తమ పరిచయ దర్శకుడు: యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)

ఉత్తమ పరిచయ నటి: నయన్ సారిక (గం గం గణేశా)

ఉత్తమ సాహిత్యం: చుట్టమల్లే చుట్టేస్తోంది (దేవర)

ఉత్తమ గాయకుడు: శ్రీకృష్ణ (కుర్చీ మడతపెట్టె, గుంటూరు కారం)

ఉత్తమ గాయని: శిల్పారావు (చుట్టమల్లె చుట్టేస్తోంది)

ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: నితిన్ జిహానీ (కల్కి 2898 ఏడీ), రామకృష్ణ, మోనిక (పుష్ప2)

ఉత్తమ కొరియోగ్రాఫర్: శేఖర్ మాస్టర్ (కుర్చీ మడతపెట్టి)

ఉత్తమ చిత్రం (క్రిటిక్స్): లక్కీ భాస్కర్

ఉత్తమ నటుడు (క్రిటిక్స్): తేజ సజ్జా

ఉత్తమ నటి (క్రిటిక్స్): కాజల్ అగర్వాల్ (సత్యభామ)

# రాజ్‌పాల్ యాదవ్ కేసులో కొత్త కోణం.. వివాదం వెనుక బిగ్ బీ


### ఆర్థిక వివాదంలో నటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట
### అమితాబ్‌తో స్టేజ్ పంచుకోనివ్వలేదనే కోపంతోనే వివాదం మొదలైందని లాయర్ వెల్లడి
### రూ.5 కోట్ల అప్పు కేసులో రాజ్‌పాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు
### మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకుంటామని కోర్టుకు తెలిపిన నటుడు

బాలీవుడ్ ప్రముఖ హాస్యనటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు సంబంధించి దశాబ్దకాలంగా కొనసాగుతున్న ఆర్థిక వివాదంలో ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. వ్యాపారవేత్త మాధవ్ గోపాల్ అగర్వాల్‌తో ఉన్న కేసులో కోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ వివాదానికి కేవలం డబ్బు మాత్రమే కారణం కాదని, దీని వెనుక బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్‌కు సంబంధించిన ఓ సంఘటన ఉందని రాజ్‌పాల్ తరపు న్యాయవాది వెల్లడించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

రాజ్‌పాల్ యాదవ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'అతా పతా లాపతా' (2012) సినిమా కోసం వ్యాపారవేత్త మాధవ్ గోపాల్ నుంచి రూ.5 కోట్లు అప్పుగా తీసుకున్నారు. ఆ సినిమా మ్యూజిక్ లాంచ్‌కు అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సమయంలో బిగ్ బీతో కలిసి వేదిక పంచుకోవాలని మాధవ్ ఆశపడ్డారని, కానీ అందుకు తాము అంగీకరించకపోవడంతో ఆయన ఆగ్రహానికి గురయ్యారని రాజ్‌పాల్ లాయర్ కోర్టుకు తెలిపారు. ఆ కోపంతోనే ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ అప్పుడే కేసు పెట్టారని వివరించారు.

వాస్తవానికి రూ.5 కోట్ల అప్పు వడ్డీలతో కలిపి రూ.10.40 కోట్లకు చేరగా, రాజ్‌పాల్ ఇప్పటికే రూ.1.90 కోట్లు చెల్లించారు. మిగిలిన మొత్తానికి బదులుగా రూ.15 కోట్ల విలువైన ఆస్తిని గ్యారెంటీగా ఇచ్చేందుకు ఒకరు ముందుకొచ్చినా, ఫిర్యాదుదారుడు అంగీకరించలేదని న్యాయవాది పేర్కొన్నారు. డబ్బు కంటే రాజ్‌పాల్‌కు జైలు శిక్ష పడాలన్నదే వారి ఉద్దేశమని ఆరోపించారు.

గతంలో ఇచ్చిన చెక్కులను బ్యాంకులో వేయడంతో ఈ వివాదం ముదిరి, ట్రయల్ కోర్టు రాజ్‌పాల్‌కు మూడు నెలల జైలు శిక్ష విధించింది. దీనిపై అప్పీల్ చేయగా, తాజాగా హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని రాజ్‌పాల్ తరపు బృందం కోర్టుకు విన్నవించింది.





# క్రీడలు



## సూపర్-8 ప్రిసీడింగ్ విధానంపై విమర్శలు.. స్పందించిన సూర్యకుమార్ యాదవ్

**ఆ స్థానంలో నేను ఉంటే కచ్చితంగా సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తానన్న కెప్టెన్**

**ఇదే విషయం గతంలోనూ వెల్లడించానని వ్యాఖ్య**

**ఐపీఎల్‌లో చాలామంది ఆడుతున్నందున వేదిక సమస్య కాదని వ్యాఖ్య**




టీ20 ప్రపంచ కప్ సూపర్ 8లో టీమిండియా తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. సూపర్ 8 ప్రిసీడింగ్ విధానంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వస్తున్నాయి. ఈ అంశంపై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పందించాడు. దీనిని ఎవరు చేస్తారో తనకైతే తెలియదని, ఒకవేళ ఆ స్థానంలో నేను ఉంటే మాత్రం కచ్చితంగా సర్దుబాటు చేయడానికి ప్రయత్నం చేస్తానని అన్నాడు. గతంలోనూ ఇదే విషయం చెప్పానని వెల్లడించాడు.

వివిధ వేదికలలో మ్యాచ్‌లు ఆడటంపై కూడా సూర్యకుమార్ యాదవ్ స్పందించాడు. ఆటగాళ్లు చాలామంది ఐపీఎల్ ఆడుతున్నందున వేదిక విషయంలో ఎవరికీ ఇబ్బంది ఉండదని అన్నాడు. ఐపీఎల్‌కు ఎవరు వచ్చినా భారతదేశంలోని అన్ని వేదికలలో ఆడారని గుర్తు చేశాడు.

సూపర్ 8 గ్రూపులను నిర్ణయించడానికి ఉపయోగించిన సీడింగ్ విధానంపై విమర్శలు వచ్చాయి. టోర్నీకి ముందే 8 జట్లకు సూపర్ 8లో సీడింగ్ కేటాయించారు. ఆ జట్లు సూపర్ 8కు అర్హత సాధిస్తే ముందుగా కేటాయించిన స్థానాల్లోనే ఆడుతాయి. సీడింగ్ ద్వారా భారత్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ ఒకే గ్రూప్‌లోకి వచ్చాయి. లీగ్ దశల్లో గొప్పగా రాణించిన జట్లకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించలేదనే విమర్శలు వస్తున్నాయి.

## టీ20 వరల్డ్ కప్: సెమీస్‌లో భారత్-పాక్ తలపడితే ముంబైలో మ్యాచ్ లేనట్టే!

**టీ20 ప్రపంచకప్‌కు భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యం**

**హైబ్రిడ్ మోడల్ ఒప్పందం కారణంగా వేదిక కొలంబోకు మార్పు**

**హోలీ పండుగ రోజే దాయాదుల మధ్య పోరు జరిగే అవకాశం**

**పాక్ కాకుండా వేరే జట్టుతో అయితే ముంబైలోనే సెమీఫైనల్**




2026లో భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్‌లో ఒక ఆసక్తికరమైన నిబంధన తెరపైకి వచ్చింది. షెడ్యూల్ ప్రకారం సూపర్-8 దశను దాటి టీమిండియా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తే ఆ మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగాల్సి ఉంది. అయితే, ఒకవేళ సెమీస్‌లో భారత్ ప్రత్యర్థిగా పాకిస్థాన్ నిలిస్తే మాత్రం ఈ లెక్కలు పూర్తిగా మారిపోతాయి. ఆ మ్యాచ్ ముంబైలో జరగదు.

భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగితే, దానిని ముంబై నుంచి శ్రీలంకలోని కొలంబోకు తరలిస్తారు. ఇరు దేశాల మధ్య 2027 వరకు అమల్లో ఉన్న 'హైబ్రిడ్ మోడల్' ఒప్పందమే ఇందుకు ప్రధాన కారణం. ఈ ఒప్పందం ప్రకారం, దాయాదుల మధ్య జరిగే మ్యాచ్‌లను తటస్థ వేదికలపైనే నిర్వహించాల్సి ఉంటుంది. గతంలో ఆసియా కప్ సమయంలోనూ ఇదే విధానాన్ని అనుసరించిన సంగతి తెలిసిందే.

ఒకవేళ సెమీఫైనల్‌లో భారత్-పాక్ తలపడితే, ఆ మ్యాచ్ మార్చి 4వ తేదీన జరుగుతుంది. విశేషమేమిటంటే, ఆ రోజు భారత్‌లో హోలీ పండుగ. దేశమంతా రంగుల వేడుకల్లో మునిగి తేలుతున్న సమయంలో, శ్రీలంక గడ్డపై దాయాదుల పోరు అభిమానులకు ఉత్కంఠను పంచనుంది. ఒకవేళ పాకిస్థాన్ కాకుండా మరే ఇతర జట్టుతోనైనా భారత్ సెమీఫైనల్ ఆడితే, ఆ మ్యాచ్ ముందుగా నిర్ణయించినట్లే మార్చి 5న ముంబైలోనే జరుగుతుంది. ఈ నిబంధనల ప్రకారం, పాకిస్థాన్ ఆడే మొదటి సెమీఫైనల్ కూడా కోల్‌కతా నుంచి కొలంబోకు మారనుంది.

## వర్షార్పణమైన కీలక మ్యాచ్.. పాకిస్థాన్ సెమీస్ ఆశలు సంక్లిష్టం

**పాక్-న్యూజిలాండ్ సూపర్-8 మ్యాచ్ వర్షంతో రద్దు**

**ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయింపు**

**క్లిష్టంగా మారిన పాకిస్థాన్, కివీస్ సెమీస్ అవకాశాలు**

**తదుపరి మ్యాచ్‌లకు కూడా వర్షం ముప్పు**




టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్ల సెమీఫైనల్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. శ్రీలంక వేదికగా శనివారం జరగాల్సిన కీలక సూపర్-8 మ్యాచ్ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో అంపైర్లు ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. సూపర్-8 దశకు రిజర్వ్ డే లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

కొలంబోలో చిరుజల్లుల మధ్య టాస్ వేశారు. టాస్ గెలిచిన పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే, కొద్దిసేపటికే వర్షం భారీగా పెరగడంతో మైదానమంతా నీటితో నిండిపోయింది. ఎంతకీ వాన తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ మ్యాచ్ కోసం పాక్ జట్టులో ఫఖర్ జమాన్, కివీస్ జట్టులో కెప్టెన్ సాంట్నర్, ఫెర్గూసన్, ఇష్ సోధీ తిరిగి చేరారు.

ప్రస్తుతం ఒక పాయింట్‌తో ఉన్న పాకిస్థాన్ సెమీస్ చేరాలంటే తదుపరి రెండు మ్యాచ్‌లలో తప్పక గెలవాలి. ఇంగ్లాండ్, శ్రీలంకలపై గెలిస్తే 5 పాయింట్లతో నేరుగా సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ ఒక మ్యాచ్ మాత్రమే గెలిస్తే, 3 పాయింట్లతో ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి వస్తుంది. రెండింటిలోనూ ఓడితే టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయం.

ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 24న ఇంగ్లండ్‌తో పాకిస్థాన్ ఆడబోయే మ్యాచ్ ఇరు జట్లకు వర్చువల్ నాకౌట్‌గా మారింది. అయితే కొలంబోలో వాతావరణం ఆందోళనకరంగా ఉండటంతో తదుపరి మ్యాచ్‌లకు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. ఇంగ్లండ్‌తో మ్యాచ్ రోజు కూడా 40 శాతం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

## ఓపెనర్‌గా బాబర్ పనికిరాడు.. మైక్ హెసన్ సంచలన వ్యాఖ్యలు

**టీ20 వరల్డ్ కప్‌లో బాబర్ ఆజం బ్యాటింగ్ ఆర్డర్ మార్పు**

**ఓపెనర్‌గా బాబర్ స్ట్రైక్ రేట్ తక్కువగా ఉండటమే కారణం**

**జట్టు ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామన్న కోచ్ హెసన్**

**ఇది ఆత్మహత్య లాంటి నిర్ణయమన్న విమర్శలపై కోచ్ వివరణ**

టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజం బ్యాటింగ్ ఆర్డర్‌పై పెద్ద చర్చే నడుస్తోంది. రెగ్యులర్ ఓపెనర్ అయిన బాబర్‌ను నాలుగో స్థానంలో ఆడిస్తుండటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇది "క్రికెట్ పరంగా ఆత్మహత్య లాంటి నిర్ణయం" అని ఓ విలేకరి పేర్కొనగా .. పాక్ హెడ్ కోచ్ మైక్ హెసన్ దీనిపై స్పందించి అసలు కారణాలను వివరించాడు.




ప్రపంచకప్‌లలో ఓపెనర్‌గా పవర్ ప్లే సమయంలో బాబర్ ఆజం స్ట్రైక్ రేట్ 100 కంటే తక్కువగా ఉందని, ఇది ఆధునిక టీ20 ఫార్మాట్‌కు సరిపోదని హెసన్ స్పష్టం చేశాడు. "జట్టుకు ప్రస్తుతం ఏం అవసరమో బాబర్‌కు తెలుసు. పవర్ ప్లేలో వేగంగా పరుగులు చేయలేనప్పుడు, మిడిల్ ఓవర్లలో జట్టును ఆదుకోవడం మంచిదని భావించాం" అని ఆయన తెలిపాడు.

ఆసియా కప్ తర్వాత బాబర్‌ను ఒక ప్రత్యేక పాత్ర కోసమే ఎంపిక చేశామని హెసన్ వివరించాడు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇన్నింగ్స్‌ను నిలబెట్టగల సత్తా అతనికి ఉందని, అందుకే నాలుగో స్థానం కేటాయించామని అన్నాడు. అయితే, 12 ఓవర్ల తర్వాత క్రీజులోకి రావడానికి బాబర్ సరైన ఆటగాడు కాదని, ఆ సమయంలో వేగంగా ఆడే హిట్టర్లు జట్టులో ఉన్నారని ఆయన కీలక వ్యాఖ్యలు చేశాడు.

ఈ నిర్ణయం బాబర్‌పై బలవంతంగా రుద్దలేదని, జట్టు ప్రయోజనాల కోసం అతడు కూడా అంగీకరించాడని హెసన్ వెల్లడించాడు. కొన్ని ప్రత్యేక సమయాల్లో తనకంటే ఇతర ఆటగాళ్లు మెరుగ్గా ఆడగలరని బాబర్ స్వయంగా గుర్తించాడని కోచ్ పేర్కొన్నాడు. ప్రస్తుతం పాకిస్థాన్ జట్టు సెమీస్ లక్ష్యంగా సూపర్-8 మ్యాచ్‌లకు సిద్ధమవుతోంది. ఈ దశలోనూ ఇదే బ్యాటింగ్ ఆర్డర్‌ను కొనసాగిస్తారా లేక బాబర్‌ను మళ్లీ ఓపెనర్‌గా పంపిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. అభిమానులు మాత్రం తమ స్టార్ బ్యాటర్‌ను మళ్లీ ఓపెనర్‌గానే చూడాలని కోరుకుంటున్నారు.



# వ్యాపారం



## రివోల్ట్ మోటార్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా హార్దిక్ పాండ్యా

**యువతను ఆకట్టుకోవడమే లక్ష్యంగా కీలక భాగస్వామ్యం**
**ధైర్యానికి, భవిష్యత్ స్ఫూర్తికి ప్రతీక హార్దిక్ అన్న కంపెనీ**
**కొత్త ఆలోచనలకు ఎప్పుడూ మద్దతిస్తానన్న పాండ్యా**
**దేశంలో ఈవీల వినియోగాన్ని పెంచే దిశగా మరో అడుగు**




ప్రముఖ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ సంస్థ రివోల్ట్ మోటార్స్, భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యాను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఈ మేరకు గురువారం నాడు ఢిల్లీలో కంపెనీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ భాగస్వామ్యం ద్వారా యువతను, ముఖ్యంగా పెర్ఫార్మెన్స్ కోరుకునే వారిని ఆకట్టుకోవాలని, తద్వారా దేశంలో ఎలక్ట్రిక్ మోటార్‌సైకిళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ తెలిపింది.

ఈ సందర్భంగా రతన్‌ఇండియా ఎంటర్‌ప్రైజెస్ ఛైర్‌పర్సన్ అంజలి రతన్ మాట్లాడుతూ.. "హార్దిక్ పాండ్యా ఆధునిక భారతదేశ స్ఫూర్తికి ప్రతీక. ఆయన ధైర్యవంతుడు, భవిష్యత్తు వైపు చూసే వ్యక్తి. మేము కేవలం ఎలక్ట్రిక్ వాహనాలను తయారుచేయడం లేదు, బాధ్యతాయుతమైన రవాణా వ్యవస్థ వైపు ఒక ఉద్యమాన్ని నిర్మిస్తున్నాం" అని అన్నారు.

దీనిపై హార్దిక్ పాండ్యా స్పందిస్తూ.. "సాధారణ పద్ధతులను సవాలు చేసే కొత్త ఆలోచనలకు నేను ఎప్పుడూ మద్దతిస్తాను. రివోల్ట్ సంస్థ ఎలక్ట్రిక్ రైడింగ్‌ను ఉత్సాహభరితంగా మార్చి మొబిలిటీపై మనకున్న అభిప్రాయాన్ని మారుస్తోంది" అని పేర్కొన్నాడు.

2017లో ప్రారంభమైన రివోల్ట్ మోటార్స్, దేశంలో ఏఐ (ఌ×) ఆధారిత మోటార్‌సైకిళ్లను పరిచయం చేసిన మొదటి సంస్థగా గుర్తింపు పొందింది. ఈ ఒప్పందంలో భాగంగా హార్దిక్ పాండ్యా త్వరలో ప్రారంభం కానున్న డిజిటల్, సోషల్ మీడియా ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటాడు. హార్దిక్ పాండ్యాకున్న క్రేజ్‌తో దేశంలో గ్రీన్ మొబిలిటీ ఉద్యమానికి మరింత ఊపు వస్తుందని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. రివోల్ట్ మోటార్స్ అనేది బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్ అయిన రతన్‌ఇండియా ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌లో భాగంగా ఉంది.

## మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!

**దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో స్వల్ప పెరుగుదల**
**హైదరాబాద్‌లో రూ.1.57 లక్షలు దాటిన 10 గ్రాముల పసిడి**
**అంతర్జాతీయ పరిణామాలే ధరల పెరుగుదలకు కారణం**
**22 క్యారెట్ల బంగారం ధర రూ.1.44 లక్షల పైకి**




దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ వారం మధ్యలో కాస్త తగ్గుముఖం పట్టిన పసిడి, శనివారం ఉదయం మరోసారి పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం (10 గ్రాములు) ధర రూ.1,57,380 వద్ద స్థిరపడింది.

ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,44,260గా ఉంది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, శుక్రవారంతో పోలిస్తే 24 క్యారెట్ల బంగారంపై రూ.880, 22 క్యారెట్లపై రూ.800 మేర పెరిగింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,520 ఉండగా, ముంబైలో రూ.1,57,370, చెన్నైలో రూ.1,57,300గా నమోదైంది.

అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలే బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, డాలర్ విలువలో మార్పులు, ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. ఈ కారణంగానే పసిడికి డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల సాధారణ వినియోగదారులపై, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోలు చేసే వారిపై ప్రభావం చూపనుంది.

## దేశంలోనే ఫాస్టెస్ట్ మెట్రో.. మీరట్‌లో సరికొత్త రికార్డు!

**మీరట్‌లో రూ.12,930 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రధాని**
**పూర్తిస్థాయిలో అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్**
**దేశంలోనే అత్యంత వేగవంతమైన మీరట్ మెట్రో సేవలకు శ్రీకారం**
**ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే ప్రయాణం**
**ఒకే ట్రాక్‌పై రీజినల్ రైలు, మెట్రో నడపడం దేశంలో ఇదే తొలిసారి**

ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఖీఖీమా) కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్




మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది.

గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.

## ఏఐతో ఉద్యోగ గండం.. 18 నెలల్లో లక్షల కొలువుల మాయం!

**వైట్ కాలర్ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం తప్పదన్న ఆండ్రూ యాంగ్**
**ఖర్చు తగ్గించుకోవడానికి కంపెనీలు ఏఐ వైపు మొగ్గు**
**టెక్ దిగ్గజాల్లో ఇప్పటికే మొదలైన ఉద్యోగాల కోత**
**ఏఐ కంపెనీలపై పన్ను విధించాలని సూచన**

కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతికత శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అమెరికాలో రాబోయే 12 నుంచి 18 నెలల్లో లక్షలాది వైట్ కాలర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయని మాజీ డెమోక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థి, వ్యాపారవేత్త ఆండ్రూ యాంగ్ సంచలన హెచ్చరికలు జారీ చేశారు. ఏఐ ప్రోగ్రామ్‌లు నిమిషాల్లో పూర్తి చేస్తున్న పనులకు గతంలో డిజైనర్లకు రోజుల సమయం పట్టేదని, ఈ మార్పు ఉద్యోగ విపత్తుకు సంకేతమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఆండ్రూ యాంగ్ విశ్లేషణ ప్రకారం కాల్ సెంటర్ సిబ్బంది, మార్కెటింగ్ నిపుణులు, కోడర్లు, డేటా అనలిస్టులు చేసే పనులను ఏఐ ఇప్పుడు సులభంగా పూర్తి చేస్తోంది. కేవలం సమాచారాన్ని విశ్లేషించి నివేదికలు ఇచ్చే సీనియర్ స్థాయి ఉద్యోగుల అవసరం కూడా భవిష్యత్తులో తగ్గిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక సంస్థ ఖర్చులను తగ్గించుకోవడానికి ఏఐని వాడి సిబ్బందిని తొలగిస్తే, పోటీలో నిలబడటానికి మిగతా సంస్థలు కూడా అదే మార్గాన్ని అనుసరించక తప్పదని ఆయన విశ్లేషించారు. సిబ్బందిని తగ్గించి లాభాలు పెంచుకునే కంపెనీలకే స్టాక్ మార్కెట్ పెద్దపీట వేయడం కూడా ఈ ధోరణికి కారణమవుతోందని తెలిపారు.

ఈ పరిణామాల వల్ల అమెరికాలోని దాదాపు 7 కోట్ల వైట్ కాలర్ ఉద్యోగాల్లో 20 శాతం నుంచి 50 శాతం వరకు రాబోయే కొన్నేళ్లలో కనుమరుగయ్యే ప్రమాదం ఉందని యాంగ్ హెచ్చరించారు. ఉద్యోగాల కోత ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీసి, రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థలను కుంగదీస్తుందని అన్నారు. దీనికి పరిష్కారంగా 'యూనివర్సల్ బేసిక్ ఇన్కమ్' (ఐఃఎ) పథకాన్ని అమలు చేయాలని, ఏఐ కంపెనీలపై అదనపు పన్నులు విధించి ఆ నిధులతో ఉపాధి కోల్పోయిన వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు.

ఈ హెచ్చరికలకు బలం చేకూరుస్తూ ఇప్పటికే అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలు తమ కార్యకలాపాల్లో ఏఐ వినియోగాన్ని పెంచి వేలాది మంది ఉద్యోగులను తొలగించడం ప్రారంభించాయి. 2026 చివరి నాటికి ఏఐ ఆధారిత ఆటోమేషన్ వల్ల ప్రపంచ టెక్నాలజీ

# బీసీ బిడ్డలంతా ఒకే గొడుగు కిందకు రావాలి - మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్



శంషాబాద్ పరిధిలోని సిద్ధాంతి వద్ద ముదిరాజ్ భవనాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీహరి ముదిరాజ్

**రాజేంద్రనగర్ ప్రజాబలం ప్రతినిధి:** రాజేంద్రనగర్,ఫిబ్రవరి 22:ముదిరాజులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా బీసీ బిడ్డలంతా ఒకే గొడుగు కిందకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ అభిప్రాయపడ్డారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన 93 వర్గాలను ఒకే గొడుగు కిందకు తేవడానికి సమీకృత బీసీ భవన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మరోవైపు శంషాబాద్ వద్ద అద్భుతం గా రూపుదిద్దుకున్న ముదిరాజ్ భవన నిర్మాణంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి శ్రీహరి ముదిరాజ్ అభినందనలు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ వద్ద నిర్మించిన సిద్ధాంతి ముదిరాజ్ భవనాన్ని ఆదివారం నాడు మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ జాతికి అంకితం చేశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, రాష్ట్ర కాంగ్రెస్ (పీసీసీ) నేతలు రాచమల్ల సిద్దేశ్వర్, ఎమ్మెస్ వేణు గౌడ్, జెల్లపల్లి నరేందర్ తదితర రాజకీయ ప్రముఖులతో కలిసి ముదిరాజ్ భవనాన్ని ప్రారంభించారు మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి శ్రీహరి ముదిరాజ్.... ముదిరాజ్ బిడ్డలంతా ఒకచోట చేరి సమావేశాలు, వేడుకలు జరుపుకునే విధంగా శంషాబాద్ వద్ద ముదిరాజ్ భవనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ముదిరాజ్ భవన నిర్మాణానికి ప్రత్యేకించి 50 లక్షల నిధులు మంజూరు చేసిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజ్ బిడ్డలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన 93 వర్గాలను ఒకే గొడుగు కిందకు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ అభిప్రాయపడ్డారు. వర్గాల వారీగా విడిపోకుండా బీసీ బిడ్డలను ఒకే ఫ్లాట్ ఫామ్ కిందకు తేవడానికి సమీకృత బీసీ భవన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన నొక్కి చెప్పారు. సమీకృత బీసీ భవనంలో అందరూ ఏకమైతే రాజ్యాధికారం ఎంతో దూరంలో లేదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా బీసీ సామాజిక వర్గం అంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా సంపూర్తిగా నిలిచిపోయిన ముదిరాజ్ భవనాల నిర్మాణాలను పూర్తి చేయడానికి తల వంతు కృషి చేస్తానని ప్రకటించారు. కోకాపేట వద్ద నిర్మిస్తున్న ముదిరాజ్ భవన నిర్మాణానికి అవసరమైన మరిన్ని నిధులు సమకూర్చడానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి శ్రీహరి ముదిరాజ్ భరోసా ఇచ్చారు.బీసీ సామాజిక వర్గంలో రాజకీయ చైతన్యం వస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రకటించారు. సిద్ధాంతి వద్ద ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోయిన ముదిరాజ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి తన నియోజకవర్గ నిధుల్లో నుండి 50 లక్షల నిధులు కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వివరించారు. ముదిరాజ్ భవన నిర్మాణంలో ఎమ్మెల్యేగా తనకు అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉందన్నారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను ముదిరాజ్ బిడ్డతో పోల్చిన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్బీసీ సామాజిక వర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను ముదిరాజ్ బిడ్డతో పోల్చారు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో చేపడుతున్న ముదిరాజ్ భవనాల నిర్మాణం కోసం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎంతగానో సహకరిస్తున్నారని ఆయన ప్రశంసించారు. సిద్ధాంతి ముదిరాజ్ భవన నిర్మాణం కోసం ప్రత్యేకత 50 లక్షల నిధులు కేటాయించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు ఆయన ముదిరాజ్ సామాజిక వర్గం తరపున కృతజ్ఞతలు చెప్పారు. మరోవైపు కోకాపేట తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చాలాచోట్ల అసంపూర్తిగా నిలిచిపోయిన ముదిరాజ్ భవనాల నిర్మాణం కోసం కృషి చేయాలని, ఇందుకోసం నిధులు కేటాయించాలని బండ ప్రకాష్ ముదిరాజ్ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ను కోరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి ముదిరాజ్ చేతుల మీదుగా ముదిరాజ్ భవన నిర్మాణం కోసం కృషి చేసిన సంఘం నేతలతో పాటు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించిన నేతలను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీహరి ముదిరాజ్ తో పాటు ఇతర అతిథులను సంఘం నేతలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్ గణేష్ గుప్తా, శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, శంషాబాద్ మాజీ జెడ్పిటిసి నీరటి తన్వి రాజు ముదిరాజ్, శంషాబాద్ మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్,ముదిరాజ్ సంఘం రాష్ట్ర నేతలు అందే బాబయ్య ముదిరాజ్, ముదిరాజ్ సంఘం జిల్లా నేత బైరమోని మల్లేష్ ముదిరాజ్, శంషాబాద్ మండల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మెరుగు సురేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నేతలు బొబ్బిలి కిష్టయ్య ముదిరాజ్, మేకల వెంకటేష్ ముదిరాజ్, యాటకారి సిద్ధేశ్వర్ ముదిరాజ్ (సుల్తాన్ పల్లి మాజీ సర్పంచ్),బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, జేరుకొని శంకర్ ముదిరాజ్, సిద్ధేశ్వర్ ముదిరాజ్,బొబ్బిలి ఉమామహేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎస్.బీ. కరుణాకర్ గౌడ్, గోరిగే నందరాజ్ గౌడ్, గొల్లపల్లి మాజీ సర్పంచ్ జిట్టే సిద్ధులు, రాచమల్ల సురేష్, ప్రముఖ సామాజికవేత్త తీగల శివ ముదిరాజ్,మాజీ కౌన్సిలర్లు తాజ్ బాబా, బండి శ్రీకాంత్ యాదవ్, ఎం.శ్రీకాంత్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు కొలను ప్రదీప్ రెడ్డి, కొనమొల్ల శ్రీనివాస్, మంచర్ల శ్రీనివాస్, మడుపతి పరమేశ్వరి నరేందర్, చిన్న గండు రాజేందర్, గుంటి చరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## భువనగిరి మున్సిపల్ చైర్మన్‌కు ఘన సన్మానం



**ప్రజాబలం ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి ఫిబ్రవరి22 యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవిని జిల్లా కాంగ్రెస్ పార్టీ సహాయ కార్యదర్శి నీరజా రెడ్డి వెంకటేశ్వర్ల రెడ్డి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులి పంపుల రాములు గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్.కె. రసూల్ పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి ప్రజల అభివృద్ధికి కృషి చేస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహనీయులకు 80వ జ్ఞానమాల కార్యక్రమం నిర్వహణ



**ప్రజాబలం ప్రతినిధి:** మేడ్చల్ మల్కాజ్గిరి 22 ఫిబ్రవరి )గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జవహర్ నగర్లోని బాలాజీ నగర్ చౌరస్తాలో ఆదివారం భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మహనీయులకు 80వ జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం అంశాలపై పలు ప్రసంగాలు నిర్వహించారు.సమితి నిర్వాహకులు మహంకాళి భిక్షు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచినా రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను ప్రజలు పూర్తిస్థాయిలో అనుభవించే పరిస్థితి ఇంకా ఏర్పడలేదన్నారు. దేశాన్ని మనమే పాలిస్తున్నామని చెప్పుకుంటున్నా సామాజిక వివక్షత ఇంకా కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో హక్కులు నిర్దిష్టంగా పొందుపరిచినప్పటికీ వాటిని అమలు చేసే విధానంలో లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు.బీఆర్ అంబేత్కర్ రాజ్యాంగాన్ని రచించి పార్లమెంటులో ప్రవేశపెట్టిన సందర్భంలో సమానత్వం రాజ్యాంగంలో ఉన్నప్పటికీ సమాజంలో లేదని స్పష్టం చేశారని గుర్తు చేశారు. సామాజిక న్యాయం స్థాపించాలంటే రాజ్యాంగ హక్కులను అమలు చేయాలని, దళితులు రాజ్యాధికారం చేపట్టినప్పుడే వారి స్థితిగతులు మారుతాయని ఆయన అభిప్రాయాన్ని ప్రస్తావించారు.నివాస హక్కు, కనీస వేతనాల చట్టం, సమాచార హక్కు, ఉపాధి హామీ చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ వంటి అంశాలు సమాజ మార్పుకు కీలకమని వక్తలు పేర్కొన్నారు. ప్రజలకు తమ హక్కులను అనుభవించేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ వ్యవస్థాపకులు రావులకోరు నరసింహ గౌడ్, కోయడ వెంకటేష్, కొమ్ము ఇలాకాంత్, బిర్రు యాకస్వామి, ఆనంద ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సంకల్పానికి మారుపేరు ముదిరాజ్ బిడ్డలు - ఎంపీ ఈటల రాజేందర్

### సిద్ధాంతి ముదిరాజ్ భవన ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్

### ముదిరాజ్ సంఘం నేతలకు ఈటెల అభినందన

### ఈటెలను ఘనంగా సన్మానించిన ముదిరాజ్ సంఘం నేతలు






**రాజేంద్రనగర్ ప్రజాబలం ప్రతినిధి:** రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 :ముదిరాజ్ బిడ్డలు సంకల్పానికి మారుపేరని మల్కాజ్ గిరి ఎంపీ బీజేపీ సీనియర్ నేత ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. సమిష్టి కృషితో శంషాబాద్ లోని సిద్ధాంతి వద్ద ముదిరాజ్ భవన నిర్మాణాన్ని అద్భుతంగా నిర్మించారని ఆయన ముదిరాజ్ సంఘం నేతలను అభినందించారు. ఆదివారం నాడు శంషాబాద్ పరిధిలోని సిద్ధాంతి వద్ద తెలంగాణ నిర్మించిన ముదిరాజ్ భవనం ప్రారంభోత్సవ వేడుకల్లో ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు.ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మెరుగు సురేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ ఈటెల.... సిద్ధాంతి ముదిరాజ్ భవన నిర్మాణం చేపట్టిన తీరు సంకల్పానికి మారుపేరుగా నిలిచిందని ప్రశంసించారు. ముదిరాజ్ బిడ్డలు చేసిన ఈ కృషి ఇతర సామాజిక వర్గాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఈటెల రాజేందర్ అభిప్రాయపడ్డారు. ఇది స్ఫూర్తితో ముందుకు సాగుతూ ముదిరాజుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ముదిరాజుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని ఈటెల రాజేందర్ భరోసా ఇచ్చారు. సిద్ధాంతి వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన ముదిరాజ్ భవన నిర్మాణం లో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి ఈటల రాజేందర్ అభినందనలు తెలిపారు.అదేవిధంగా భవన నిర్మాణం పూర్తి కావడానికి ఆర్థికంగా సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నేతలు ఎంపీ ఈటెల రాజేందర్ ను శాలువా కప్పి మెమెంటో తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నేత అందే బాబయ్య ముదిరాజ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ ముదిరాజ్, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు రాచమల్ల సిద్దేశ్వర్, ఎమ్మెస్ వేణు గౌడ్, జెల్లపల్లి నరేందర్, మహిళా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా సీనియర్ నేత మైలారం సులోచన, మాజీ కౌన్సిలర్ సంజయ్ యాదవ్ (శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు), శంషాబాద్ మండల్ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గొరిగే నందరాజు గౌడ్,జిల్లా నేత బైరమోని మల్లేష్ ముదిరాజ్, శంషాబాద్ మండల్ అధ్యక్షుడు మెరుగు సురేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నేతం బొబ్బిలి కిష్టయ్య ముదిరాజ్, యాటకారి సిద్ధేశ్వర్ ముదిరాజ్(సుల్తాన్ పల్లి మాజీ సర్పంచ్), బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, పల్లె మోని సిద్ధేశ్వర్ ముదిరాజ్, బొబ్బిలి ఉమామహేశ్వర్ ముదిరాజ్, కన్నా ముదిరాజ్, మెరుగు , బొబ్బిలి ఉమామహేశ్వర్ ముదిరాజ్, పిట్టల సుధాకర్ ముదిరాజ్, పల్లెమోని హరినాథ్ ముదిరాజ్, కొంకరి రాజు ముదిరాజ్, మెరుగు కన్నయ్య ముదిరాజ్, పల్లెమోని యాదగిరి ముదిరాజ్, కుమార్ ముదిరాజ్, శంషాబాద్ మండల్ మాజీ జెడ్పిటిసిలు నీరటి తన్వీరాజు ముదిరాజ్, బూరుకుంట సతీష్, పాలమాకుల్ సర్పంచ్ కట్కూరి కోటేశ్వర్ గౌడ్, మదనపల్లి సర్పంచ్ మౌనిక ఆంజనేయులు ముదిరాజ్,నాగారం సర్పంచ్ లింగం ముదిరాజ్, నాగర్ కుంట సర్పంచ్ మల్లేష్ ముదిరాజ్, కొందుర్గు మాజీ సర్పంచ్ యాదయ్య ముదిరాజ్, కొత్తూరు కౌన్సిలర్ హేమా దేవేందర్ ముదిరాజ్,బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చింతల నందకిషోర్ గుప్తా తదితర నేతలు పాల్గొన్నారు.

# శతాబ్ది వేడుకలలో ఫ్లాష్ మాబ్

## ఖమ్మం నగరం లో శాతబ్ది ఉత్సవాలు




**ఖమ్మం ప్రతినిధి (ప్రజాబలం)** ఖమ్మం శాతబ్ది ఉత్సవాలు జరుపుతున్న సంస్థ ఖమ్మం లోని గవర్నమెంట్ కాలేజీ లో మరియు సర్దార్ వలభాయ్ పటేల్ స్టేడియంలో శతాబ్ది వేడుకల ఫ్లాష్ మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఇందులో ఫ్లాష్ మాబ్ కళాకారులు తమ నృత్యాలతో ప్రజలను ఉర్రూతలూగించారు అలానే శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి ప్రజలను ఆసక్తికరమైన ప్రశ్నలను అడిగి వారికీ చిరు బహుమానాలను అందించడం జరిగింది ఈ కార్యక్రమాల ద్వారా శాతబ్ది ఉత్సవాల గురించి నగర ప్రజలలో మరింత ఉత్కంట కలిగింది ఈ కార్యక్రమంలో ఖమ్మం ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ గడ్డం సాధన్ పాల్గొని ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కల్పించారు శతాబ్ది వేడుకలు అసలు ఎవరివి అని ప్రజలు చాలా ఉత్సాహనీతో పెద్ద సంఖ్యలో



# జమ్మికుంట ప్రెస్ క్లబ్ లో చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం....

### వర్కింగ్ జర్నలిస్టు సమస్యను పరిష్కరిస్తాం. జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముంతాజ్ ఆలీ (జావిద్)

**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 22** జమ్మికుంట పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో మునిసిపాలిటీ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), వైస్ చైర్మన్ ముంతాజ్ ఆలీ (జావిద్) లకు స్థానిక తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు. సౌడమల్ల యోహాన్, ఏ బూసి సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు . ఈ సందర్భంగా చైర్మన్



వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తాను,ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. స్థానిక ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైన తమ దృష్టికి తీసుకురావాలని స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూపతి సంతోష్, జిల్లా నాయకులు ఖాజా ఖాన్, టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు కందుకూరి రాజు, అంబాల రాజు, కొక్కుల శ్రీరామ్, రచ్చ రవి కృష్ణ, గుండా రాజేంద్రప్రసాద్, జర్నలిస్టు ,ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ మూడో వార్డు కౌన్సిలర్ లకు సన్మానం



**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 22 (ప్రజాబలం)** ఎదులాపురం మున్సిపాలిటీ సాయి గణేష్ నగర్ లో మూడో వార్డు కౌన్సిలర్ కొమరగిరి సత్యావతి సుమన్ లను ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువా లు కప్పి,బొకేలు అందచేసి సన్మానించారు ఈసందర్భంగా ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోదాటి గిరి మాట్లాడుతూ తాము ప్రతి రోజు స్విమ్మింగ్ చేసే గురుదక్షిణ ఫౌండేషన్ మున్నేరు ప్రాంతం ఏదులాపురం మున్సిపల్ పరిధిలో ఉన్నందువల్ల గౌరవ సూచకంగా నూతనంగా ఎన్నికైన మూడో వార్డు నుండి మా అసోసియేషన్ ఎక్జిక్యూటివ్ మెంబర్ కొమరగిరి సుమన్ భార్య సత్యావతి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన సందర్భంగా వారిని సన్మానించామని పేర్కొన్నారు.ప్రతి రోజు దాదాపు రెండు వందల మంది స్విమ్మర్లు గురుదక్షిణ ఫౌండేషన్ దగ్గర మున్నేరు లో ఈత కొడుతుంటామని, వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కువ సంఖ్యలో వస్తారని దాదాపు నాలుగు వందల మంది పైగా ఉంటారని, మున్నేరు కు నిర్మిస్తున్న కరకట్ట కు రెండు వైపులా మెట్లు నిర్మించుటకు తన వంతు సాయం చేయాలని కోరినట్లు తెలిపారు ఈత నేర్చుకోవడానికి బాలికలు, మహిళలు కూడా వేసవిలో వస్తారని వారి సౌకర్యార్థం రెండు స్నానపు గదులు బట్టలు మార్చుకోవడానికి ప్రభుత్వం నుండి ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సిరిపురపు బుజ్జి, అధ్యక్షుడు కోదాటి గిరి, ప్రధాన కార్యదర్శి మందపల్లి లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొనకంచి వీరభద్రం,గౌరవ సలహాదారులు కనకం జనార్ధన్ రావు, జాయింట్ సెక్రటరీ లు షేక్ జానీమియా, బోయిన విశ్వనాథం, ఎక్జిక్యూటివ్ మెంబర్ లు కొమరగిరి సుమన్,ఏ.యన్.ఆర్.,దోనే నాగేందర్ రెడ్డి,పద్మనాభ రెడ్డి,నల్లు వెంకట్ రెడ్డి,కొలికపాక నాగేశ్వరరావు మద్ది నాగేశ్వరరావు పరమేష్ మోరం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు



## నిస్వార్థ నాయకత్వమే దేశానికి ముఖ్యం..

### నితిన్ నబిన్‌కు మహంత్ స్వామి మహారాజ్ ఆశీస్సులు

హైదరాబాద్, భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తర్వాత తిన్ నబిన్ తొలిసారిగా గుజరాత్ రాష్ట్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గాంధీనగర్‌లోని సుప్రసిద్ధ పూజ్య స్వామినారాయణ్ అక్షరధామ్ క్షేత్రాన్ని సందర్శించి, పవిత్ర మహంత్ స్వామి మహారాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బాధ్యతలు చేపట్టిన అనంతరం రాష్ట్రానికి విచ్చేసిన ఆయనకు ఘనస్వాగతం లభించింది. అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ భేటీలో నితిన్ నబిన్ మహంత్ స్వామి మహారాజ్ నుండి ఆశీర్వాదాలు తీసుకున్నారు. దేశంలో నిరంతర శాంతి, ఐక్యత, సామరస్యం, శ్రేయస్సు వెల్లివిరియాలని స్వామిజీ ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నైతిక విలువలతో కూడిన నాయకత్వం దేశాభివృద్ధికి ఎంతో అవసరమని ఆయన తెలిపారు.ఈ పర్యటనలో నితిన్ నబిన్ వెంట పలువురు బిజెపి అగ్రనేతలు ఉన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్, జగదీష్ విశ్వకర్మ, రత్నాకర్జీ సహా పలువురు నేతలు ఆయన వెంట ఉన్నారు. మహంత్ స్వామి మహారాజ్ తన సందేశంలో.. కరుణ, నిస్వార్థ నాయకత్వం, సమగ్రత వంటి విలువలను ప్రతి నాయకుడు అలవర్చుకోవాలని సూచించారు. సమాజ సమగ్ర అభివృద్ధికి, సాంస్కృతిక విలువల పరిరక్షణకు ఉమ్మడి నిబద్ధత అవసరమని ఈ సమావేశం చాటిచెప్పింది. అక్షరధామ్ యొక్క ప్రశాంత వాతావరణంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక సంభాషణ ప్రజా జీవితంలో నైతిక విలువల ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది.

# టేక్మాల్ గ్రామంలో కోతుల సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 22 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా: టేక్మాల్ గ్రామంలో సంవత్సరాలు గడిచిన కోతుల, సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో అని, గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు, ఇంటి ముందర ఏదైనా పండ్ల చెట్టు ఉన్నా, కోతుల భయానికి వాటిని కొట్టి వేయడం జరుగుతుంది, గ్రామంలో ఎంతోమంది, తమ ఇళ్ళ ముందు ఉన్న పండ్ల చెట్లను, నరికి వేయడం జరిగింది, వీటి భయానికి గ్రామంలో ఎవరు కూడా తమ ఇండ్ల ముందు, పండ్ల చెట్లను పెంచుకోవడం మానేశారు, గ్రామంలో ఆడవాళ్లు ఒంటరిగా మాత్రం ఉంటే, వారి పైన వాటి ప్రతాపం చూపుతున్నాయి, వీటి భయానికి గ్రామంలోని స్త్రీలు ఒంటరిగా ఇంటి బయటకు రావడం లేదు, ఒకప్పుడు పంట పండించాలి అంటే, రకరకాల పంటలు పండించేవారు, ఇప్పుడు ఈ కోతుల, భయానికి వరి పంట మాత్రమే పండిస్తున్నాము, ఇలా ఎన్నో రకాల ఇబ్బందిలకు గురవుతున్నామని, నూతనంగా గెలిచినటువంటి గ్రామ పంచాయితీ సర్పంచ్, గ్రామంలోని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు, దయచేసి మా విన్నపము గ్రామంలోని కోతుల, సమస్య పరిష్కరించాలని, , ఇప్పటికైనా మామోర ఆలకించి, ఈ కోతుల సమస్య పరిష్కరించాలని గ్రామ సర్పంచ్,ని గ్రామస్తులు వేడుకుంటున్నారు....

# ప్రతి ఒక్కరు తమ బ్యాంక్ అకౌంట్ యొక్క కెవైసీ అప్డేట్ చేసుకోవాలి

## ఆందోల్ డివిజన్ ఆర్బిఐ కౌన్సిలర్ మురళీకృష్ణ






**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 22 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంట్ యొక్క కేవైసీ అప్డేట్ చేసుకోవాలని, ఆందోల్,డివిజన్ ఆర్బిఐ కౌన్సిలర్ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం హత్నూర,మండలం కొన్యాల,గ్రామంలో వారు మాట్లాడుతూ,బ్యాంక్ అకౌంట్ కలిగి ఉన్న ప్రతి ఒక్కరు కెవైసీ అప్డేట్ చేసుకోవాలనిచెప్పారు, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండి అకౌంట్లను సురక్షితంగా ఉంచుకోవాలి, ఏదైనా అపరిచిత నంబర్ నుంచి ఫోన్ కాల్స్ వస్తే, ఓటీపీలు కానీ బ్యాంక్, సంబంధించిన వివరాలు కానీ,ఇతరులకు చెప్పకూడదు అని అన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే ఇన్సూరెన్స్, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, మరియు జీవన్ జ్యోతి బీమా యోజన, గురించి తెలిపారు,సైబర్ మోసాల గురించి అప్రమత్తంగా ఉండాలన్నారు, అకౌంట్ కు సంబంధించి సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయాలనుకుంటే 1930,కి కాల్ చేసి అకౌంట్ ను సురక్షితంగా కాపాడుకోవాలి అని తెలిపారు,ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళా సంఘాలు గ్రామస్తులు ,యువకులు, పాల్గొన్నారు......

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com